ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 02 సంచిక -300 పేజీలు - 08 వెల - 04/- ఆదివారం14 సెప్టెంబర్ 2025

# శాంతిభద్రతలతోనే రాష్ట్రానికి పెట్టుబడులు

## జిల్లా ఎస్పీలతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నతస్థాయి సమావేశం

**రాజకీయ ముసుగులో నేరాలను ఉపేక్షించవద్దని కఠిన హెచ్చరిక**

**వివేకా హత్య, సింగయ్య మృతి కేసులను అధ్యయనం చేయాలని సూచన**

**దర్యాప్తులో టెక్నాలజీ వాడకం పెంచాలని ఆదేశం**

**'రియాక్ట్, రీచ్, రెస్పాండ్, రిజల్ట్' విధానాన్ని పాటించాలని పోలీసులకు పిలుపు**



అమరావతి **సెప్టెంబర్ 13ఆంధ్ర ప్రగతి** రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణ తనకు అత్యంత ప్రాధాన్యమైన అంశమని.... ఈ విషయంలో రాజీ అనేది లేదని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. లా అండ్ ఆర్డర్ బాగుంటేనే పెట్టుబడులు వస్తాయి. ప్రజలకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు వస్తాయిమిగతాది 2లో...

# ఈశాన్య భారతం దేశానికే 'గ్రోత్ ఇంజిన్'

**మిజోరంలో రూ. 9,000 కోట్లకు పైగా విలువైన ప్రాజెక్టులకు ప్రధాని శ్రీకారం**

**మణిపూర్‌ను దేశంతో అనుసంధానం చేస్తాం**

**దేశానికి ఈశాన్య రాష్ట్రాలు వృద్ధి చోదక శక్తిగా మారాయని వ్యాఖ్య**

**కీలకమైన బైరబీ-సైరంగ్ రైల్వే ప్రాజెక్టును ప్రారంభించిన ప్రధాని**

**ఢిల్లీ, కోల్‌కతా, గువాహటికి మూడు కొత్త రైలు సర్వీసుల ప్రారంభం**

**గత ప్రభుత్వాలు ఈశాన్యంలో ఓటు బ్యాంకు రాజకీయాలు చేశాయని విమర్శ**

ఇంఫాల్ **సెప్టెంబర్ 13ఆంధ్ర ప్రగతి** మణిపూర్ పేరులోనే మణి ఉందని అది దేశానికే మణి వంటిదని, మణిపూర్ దేశానికి ప్రకృతి ఇచ్చిన బహుమతి అని ప్రధాని మోడీ కొనియాడారు. మణిపూర్ ను వేగంగా ప్రగతి పథంలో పయనింపజేస్తాం అని మణిపూర్ కోసం రూ.7 వేల కోట్ల ప్రాజెక్టులను ప్రారంభిస్తున్నామని తెలియజేశారు. మణిపుర్‌ను దేశంతో అనుసంధానం చేసే ప్రాజెక్టులు చేపడుతున్నామని, రైలు, రోడ్డు మార్గాల కోసం మణిపుర్ కు నిధులు కేటాయిస్తున్నామని అన్నారు. భారీ వర్షాల వల్ల హెలికాప్టర్ లో రావడం సాధ్యపడలేదని నరేంద్ర మోడీ తెలిపారు. రోడ్డు మార్గంలో మణిపూర్ కు వచ్చానని అన్నారు. చాలాకాం తరవాత మణిపూర్ లో మోడీ పర్యటించారు.



మిగతా 2లో.

# సొంతింటి కల సాకారానికి నిధిని ఏర్పాటుచేయండి

**సుప్రీం ధర్మాసనం సూచన**




న్యూఢిల్లీ **సెప్టెంబర్ 13ఆంధ్ర ప్రగతి**

పన్ను చెల్లించే మధ్యతరగతి ప్రజల్లో చాలా మంది సొంతింటి కలలు సాకారం కాకపోవడంపై సుప్రీం కోర్టు తీవ్రంగా స్పందించింది. ఇళ్ల కొనుగోలుదారుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టుల్లో నిధులను కేటాయించాల్సిన మిగతాది 2లో...

# సుపరిపాలన వేళ వైషమ్యాల కుట్రలు

## పదేళ్లుగా చూస్తున్నాం... అలాంటి వారి ఉచ్చులో పడవద్దు: పవన్ కల్యాణ్

**సోషల్ మీడియా, యూట్యూబ్ చానెళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచన**

**మచిలీపట్నం వివాదంపై అంతర్గత విచారణకు జనసేనాని ఆదేశం**

అమరావతి **సెప్టెంబర్ 13ఆంధ్ర ప్రగతి**


రాష్ట్రం అభివృద్ధి దిశగా.. సంక్షేమ ఫలాలు ప్రజలకు అందిస్తూ సుపరిపాలన సాగిస్తున్నామని అలాంటి వేళ ప్రజల మధ్య వైషమ్యాలు సృష్టించేందుకు కుట్రలు మొదలయ్యాయని డిప్యూటీ– సీఎం పవన్ కల్యాణ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి కుట్రలకు పాల్పడే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలంటూ జనసేన పార్టీ శ్రేణులకు ఆయన సూచించారు. వారు చేసే దుష్ప్రచారాన్ని ప్రజాస్వామ్య యుతంగా, చట్ట ప్రకారం తిప్పికొడదామని పార్టీ శ్రేణులకు డిప్యూటీ– సీఎం పవన్ కల్యాణ్ పిలుపు నిచ్చారు.మిగతాది 2లో...



# ఎపిలో పలువురు ఐపిఎస్‌ల బదిలీ

పలు జిల్లాల ఎస్పీల బదిలీలు..నియామకాలు

- తిరుపతి ఎస్పీగా తిరిగి సుబ్బారాయుడు నియామకం




2లో.

# విశాఖ స్టీల్‌పై లెఫ్ట్ పార్టీల దుష్ప్రచారం

**మూడు రాజధానుల పేరుతో జగన్ నాటకాలు**

**-కూటమి ద్వారా ఎపిలో అభివృద్ధి పరుగులు**

**బిజెపి అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ వెల్లడి**



2లో.

# కృష్ణా జలాల్లో న్యాయమైన వాటాను సాధించి తీరాలి

**ఏపీ అక్రమ తరలింపును ఆధారాలతో సహా కృష్ణా ట్రైబ్యునల్ ముందుంచాలి: రేవంత్ రెడ్డి**

**రాష్ట్ర ప్రయోజనాలను పరిరక్షించేందుకు బలమైన వాదనలు వినిపించాలని వ్యాఖ్య**

**నీటి వాటాను సాధించడంలో కేసీఆర్ విఫలమయ్యారని ఆరోపణ**

**సెప్టెంబర్ 13ఆంధ్ర ప్రగతి**

కేసీఆర్ నిర్లక్ష్యం కారణంగానే ఆంధ్రప్రదేశ్ కృష్ణా జలాలను తరలించుకుపోయిందని, ఏపీ అక్రమ తరలింపును ఆధారాలతో సహా కృష్ణా జల వివాదాల ట్రైబ్యునల్ ముందు నివేదించాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కృష్ణా జలాల్లో తెలంగాణ రాష్ట్రానికి న్యాయమైన వాటా సాధించి తీరుతామని ఆయన స్పష్టం చేశారు.మిగతాది 2లో...



# ఎన్డీయే ప్రభుత్వం ఒక్క హామీని కూడా అమలు చేయలేదు

**సూపర్ సిక్స్ పథకాలు సూపర్ ఫ్లాప్ అయ్యాయని రోజా విమర్శ**

**పవన్ కల్యాణ్‌కు ఓటేసినందుకు ప్రజలు బాధపడుతున్నారని వ్యాఖ్య**



ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వంపై వైసీపీ నాయకురాలు, మాజీ మంత్రి ఆర్కే రోజా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన 'సూపర్ సిక్స్' హామీలు సూపర్ ఫ్లాప్ అయ్యాయని, అబద్ధాలు చెప్పి చంద్రబాబు అధికారంలోకి వచ్చారని ఆమె ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఇప్పటివరకు ఒక్క హామీని కూడా నెరవేర్చలేదని విమర్శించారు.ముఖ్యంగా మెడికల్ కాలేజీల విషయంలో మంత్రులు చేస్తున్న ప్రచారాన్ని రోజా తప్పుబట్టారు. మంత్రులు చూపిస్తున్న వీడియోలు నిజమైనవి కావని, అవన్నీ ఫేక్ అని ఆరోపించారు. హోంమంత్రి అనిత మెడికల్ కాలేజీలపై చూపించింది ప్రజెంటేషన్ కాదని, అది ఆమె ఫ్రస్టేషన్ అని ఎద్దేవా చేశారు. మిగతాది 2లో...

# శాంతిభద్రతలతోనే రాష్ట్రానికి పెట్టుబడులు

(మొదటి పేజి తరువాయి)

. రాష్ట్ర గ్రోత్ రేట్ పెరుగుతుంది. ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఇదే నా విధానం అని సీఎం అన్నారు. జిల్లాల ఎస్పీల బదిలీ నేపథ్యంలో వారితో సీఎం సమావేశం నిర్వహించారు. శాంతి భద్రతలు సహా పలు అంశాలపై ఎస్పీలకు దిశా నిర్దేశర చేశారు. కొందరు ఎస్పీలు నేరుగా సమావేశానికి హాజరు కాగా... మరికొన్ని జిల్లాల ఎస్పీలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ రాజకీయ ముసుగులో నేరాలను ఉపేక్షించకండి. నేరాల తీరు మారింది. కొత్త తరహా నేరాలు... కొత్త తరహా నేరస్తులు వచ్చారు. ఈ విషయంలో పోలీసులు కూడా అప్ డేట్ కావాలి. అప్పుడే శాంతి భద్రతలను పటిష్టంగా కొనసాగించగలమని సీఎం అన్నారు. అన్ని కోణాల్లో ఆలోచించి మీకు ఎస్పీలుగా అవకాశం ఇచ్చాను. బెస్ట్ ఫెర్మామెన్స్‌తో ప్రభుత్వానికి మంచి పేరు తేవాలి. తొలిసారి సీఎం అయినప్పటి నుంచి నా ఫోకస్ లా అండ్ ఆర్డర్ మీదే ఉండేది. ఫ్యాక్షనిజం, నక్సలిజం, రౌడీయిజం, మత ఘర్షణలు వంటి వాటి విషయంలో చాలా కఠినంగా ఉండేవాడిని. ఫ్యాక్షన్ అణిచివేత కోసం మా పార్టీ ప్రజా ప్రతినిధులను కూడా అరెస్టు చేసిన సందర్భాలు రాయలసీమలో ఉన్నాయి. అంత కఠినంగా ఉండడం వల్లనే నాడు ఫ్యాక్షన్‌ను దూరం చేయగలిగాం. ఫ్యాక్షన్‌లో ప్రాణాలు కోల్పోయిన వారి పిల్లలను ఎన్టీఆర్ మెమోరియల్ స్కూల్‌లో చదివించాను. వారు మళ్లీ ఫ్యాక్షన్ వైపు వెళ్లకుండా చర్యలు తీసుకున్నాను. నాడు తెలంగాణలో నక్సల్ విషయంలో చాలా భయంకరమైన పరిస్థితులు ఉండేవి. తెలంగాణ పల్లెల నుంచి హైదరాబాద్ సరిహద్దు జిల్లాల వరకు నక్సలైట్లు- ఉండేవాళ్లు. దీంతో చాలా మంది తెలంగాణ నేతలు ఎన్నికల సమయంలో తప్ప గ్రామాలకు వెళ్లే వాళ్లు కాదు. ఒకసారి పోలీస్ స్టేషన్ పేల్చివేస్తే పోలీసులు వెళ్లడానికి భయపడ్డారు. నేను స్వయంగా వెళ్లి పోలీసుల్లో ÷-థసైర్యం నింపాను. తరువాత గ్రేహౌండ్స్ వంటి విభాగాలను తెచ్చాం. దీంతో నక్సలిజాన్ని అణిచి వేశాం. నాడు ఉప ప్రధానిగా ఉన్న అద్వానీని ఆహ్వానించి ఈ కార్యక్రమాలు వివరించాను.' అని సీఎం చంద్రబాబు అన్నారు. నాడు చాలా కఠినంగా ఉన్నాను కాబట్టే అలిపిరిలో నాపై దాడి చేశారు. నాపై దాడి సమయంలో ముందు అది ప్రమాదం అనుకున్నాను. కానీ బాంబు దాడి అని అక్కడకు వచ్చిన ఎస్పీ చెప్పారు. నాతో ఆసుపత్రికి ఎందుకు వచ్చారు..? వెంటనే ఆ ఏరియాను బ్లాక్ చేసి సెర్చ్ ఆపరేషన్ చేయండని ఆదేశించాను. ఇంకా ఏమైనా -ల్గ÷కె-మోర్ మైన్లు ఉంటే తొలగించాలని... వేరే వాళ్లకు వాటితో ప్రమాదం వాటిల్లకుండా చూడాలని పోలీసులకు చెప్పాను. దొరికిపోతాం అనే భయం ఉంటే నేరాలు తగ్గించవచ్చు. బెజవాడలో రౌడీ వ్యవహారాలు ఎక్కువగా ఉండేవి. సమర్ధులైన అధికారులతో ఇక్కడ రౌడీయిజం లేకుండా చేశాం. నాడు కఠినంగా వ్యవహరించడం వల్లనే హైదరాబాద్‌కు పెట్టుబడులు వచ్చాయి. నేడు బ్రాండ్ అయ్యింది. మనం తీసుకునే నిర్ణయాలు భవిష్యత్తులో అనేక మార్పులకు కారణం అవుతాయి.' అని చంద్రబాబు అన్నారు. ఒకప్పుడు రాజకీయ నాయకులు అవసరానికి రౌడీలను, క్రిమినల్స్‌ను వాడుకునే వాళ్లు. అయితే నేడు రాజకీయాల ముసుగులో నేరాలు చేస్తున్నారు. పాలిటిక్స్‌ను క్రిమినలైజ్ చేశారు. వివేకా హత్య విషయంలో ఏం జరిగిందో ప్రతి పోలీసు అధికారి స్టడీ చేయాలి. ఒక దారుణ హత్యను గుండెపోటు- అన్నారు... తరువాత హత్య అన్నారు... తరవాత నాపై నెట్టారు... సీబీఐ కావాలి అన్నారు...తర్వాత వద్దు అన్నారు... ఇలా ఒక్కటి కాదు... దేశంలో మరే కేసులోనూ ఇన్ని మలుపులు ఉండవు. పోలీసు అధికారులకు ఇదొక పెద్ద కేస్ స్టడీ. ఇదొక్కటే కాదు... మొన్న మన ప్రభుత్వంలో సింగయ్య మృతి ఉదంతాన్ని గమనించే ఉంటారు. వాళ్ల కారు కింద పడి వాళ్ల కార్యకర్త చనిపోతే కూడా పట్టించుకోలేదు. దాన్ని దాచి పెట్టారు. రెండు రోజుల తరువాత వీడియో బయటపడకపోతే ఘటన ఎలా జరిగిందో కూడా తెలిసేది కాదు. ఈ విషయంలో పోలీసు అధికారులు తప్పుడు ప్రచారాన్ని నమ్మారు. చివరికి విషయం బయటపడ్డాక... కార్యకర్తపై కారు ఎక్కించిన పార్టీ నేతలే బాధిత కుటు-ంబంతో ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడించారు. అంబులెన్స్ లో ఏదో జరిగిందని చెప్పే ప్రయత్నం చేశారు. అంటే వాళ్ల క్రిమినల్ పాలిటిక్స్ ఎలా ఉంటాయో మీరు అర్థం చేసుకోవాలి. అలాంటి వాళ్లు ఉన్న రోజుల్లో మనం ప్రభుత్వాలు నడుపుతున్నామనేది మీరంతా గుర్తుంచుకోవాలని ముఖ్యమంత్రి వివరించారు. నేడు నేరాల తీరు మారింది. అంటే మీ దర్యాప్తు తీరు కూడా మారాలి. -టె-క్నాలజీని 100 శాతం ఉపయోగించుకోండి. ఇన్వెస్టిగేషన్‌లో -టె-క్నాలజీతో బెస్ట్ రిజల్ట్ ఇస్తుంది. సీసీ టీ-వీలు లేకపోతే పాస్టర్ ప్రవీణ్ మృతిని ప్రభుత్వానికి చుట్టేవాళ్లు. ప్రవీణ్ మృతి విషయంలో వాస్తవాలను -టె-క్నాలజీతో స్పష్టంగా చెప్పగలిగాం. లేకుంటే రాష్ట్రంలో శాంతి భద్రతలకు ఎంత నష్టం జరిగిదో... ఎన్ని గొడవలు జరిగేవో ఆలోచించండి. ప్రజలతో ఫ్రెండ్లీగా... అసాంఘీక శక్తులు భయపడేలా పని చేయండి. సోషల్ మీడియా సైకోలను కట్టడి చేయండి. మహిళల వ్యక్తిత్వ హననం చేసే వాళ్లను ఉపేక్షించకండి. సోషల్ మీడియా ఫేక్ ప్రచారాలు, సైబర్ -క్రై-ం, క్రిమినల్ పాలిటిక్స్ బిగ్ ఛాలెంజ్ గా మారాయి. ఫ్రెండ్లీ పోలీసింగ్ ఉండాలి... క్రిమినల్స్ కు భయం ఉండాలి. తప్పు చేస్తే దొరుకుతాం అనే ఆలోచన వస్తే నేరాలు తగ్గుతాయి. ప్రజా ప్రతినిధులతో సామరస్యంగా, సమన్వయంతో పని చేయండి. తప్పు చేస్తే మాత్రం ఏ పార్టీ వాళ్లను అయినా శిక్షించండి. ఈ విషయంలో రాజీలేదు. మా ఎమ్మెల్యేలు, మంత్రులు చెప్పేదానిలో మంచి ఉంటే పాటించండి. తప్పు ఉంటే చేయమని చెప్పను. మా పార్టీ వాళ్లు చెప్పరు. ఇది కూటమి విధానం అని సీఎం అన్నారు. పోలీసు అధికారులు, సిబ్బంది రియాక్ట్ రీచ్, రెస్పాండ్, రిజల్ట్ అనే విధానంలో పనిచేయాలని ముఖ్యమంత్రి సూచించారు.

# ఈశాన్య భారతం దేశానికే 'గ్రోత్ ఇంజిన్'

(మొదటి పేజి తరువాయి)

మణిపుర్ లో అల్లర్ల బాధితులను పరామర్శించారు. ఇంఫాల్, చురాచంద్ పుర్ లో పలు ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. మణిపుర్ లో అల్లర్ల బాధిత కుటుంబాల చిన్నారులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా మణిపుర్ బహిరంగ సభలో మాట్లాడారు. రోడ్డు మార్గంలో వచ్చేటప్పుడు తనకు తమరు పలికిన స్వాగతం మర్చిపోలేనని, మువ్వెన్నల జెండాలు చేతబట్టి తనకు ఘనంగా స్వాగతం పలికారని ఆనందాన్ని వ్యక్తం చేశారు. రూ. 8 వేల కోట్లతో జాతీయ రహదారుల పనులు వేగంగా కొనసాగుతున్నాయని, మణిపుర్ లో రైల్ కనెక్టివిటీ- భారీగా పెంచుతున్నామని మోడి పేర్కొన్నారు. భారత్ వేగంగా అభివృద్ధి చెందుతోందని, త్వరలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించబోతుందని చెప్పారు. ప్రస్తుతం మణిపుర్ చేపడుతున్న ప్రాజెక్టులతో మౌలిక సదుపాయాలు, వైద్యసేవలు మెరుగవుతాయని, ఈశాన్య రాష్ట్రాల్లోదశాబ్దాలుగా అనేక వివాదాలు, ఉద్యమాలు ఉన్నాయని అన్నారు. ప్రస్తుతం ఈశాన్య రాష్ట్రాల్లో శాంతి నెలకొంటోందని, శాంతి స్థాపన ద్వారానే అభివృద్ధి సాధ్యమవుతుందని వెల్లడించారు. శాంతి స్థాపన ద్వారా తమ భావితరాల భవిష్యత్తు బావుంటుదని, మణిపుర్ ప్రజల వెంట భారత ప్రభుత్వం ఉందని మోడి స్పష్టం చేశారు. జాతుల మధ్య ఘర్షణలకు కేంద్రమైన చురాచంద్‌పుర్ జిల్లాకు చేరుకున్నారు. అక్కడ బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. హింసాత్మక ఘటనల వల్ల నిరాశ్రయులైన వారితో మాట్లాడారు. 2023లో ఈ ఘర్షణలు చోటుచేసుకోగా.. రెండేళ్ల తర్వాత మోడీ ఆ రాష్ట్రానికి వెళ్లారు. శరణార్థి శిబిరాల్లో ఉన్న చిన్నారులను పలకరించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటాన్ని ఓ చిన్నారి కానుకగా ఇచ్చింది. రాష్ట్రంలో శాంతిభద్రతలను పునరుద్ధరించేందుకు కేంద్రం కట్టుబడి ఉందని వారికి హామీ ఇచ్చారు. తర్వాత స్థానికంగా ఏర్పాటు-చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. 'మణిపుర్ ప్రకృతి ప్రసాదించిన కానుక. ఈ రాష్ట్ర ప్రజలకు తలవంచి నమస్కరిస్తున్నాను. ఇది సాహసవంతులు పుట్టిన నేల. మణిపుర్ లో కొండలు చాలా అందంగా ఉన్నాయి. పేరులో ఉన్న మణికి అర్థం.. ఈశాన్య రత్నమని. ఈ రాష్ట్రాన్ని మళ్లీ అభివృద్ధి పథంలోకి తీసుకువస్తాం. ఇలాంటి అందమైన ప్రాంతంలో హింస చెలరేగింది. కొత్త ఉషస్సు ప్రారంభం కానుంది. ప్రజలు శాంతి మార్గాన్ని ఎంచుకున్నారు. శాంతి చర్చలు మొదలయ్యాయి. నేను మీతో ఉన్నాను. కేంద్రం మీ వెంటే ఉంటు-ందని హామీ ఇస్తున్నాను. ఈ రాష్ట్రం శాంతికి చిహ్నంగా మారాలని కోరుకుంటున్నాను అని మోదీ అన్నారు. వర్షాన్ని కూడా లెక్క చేయకుండా సభకు వచ్చిన వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. మెయిటీలకు రిజర్వేషన్లు ఇవ్వాలన్న ప్రతిపాదనపై వచ్చిన వ్యతిరేకత 2023లో మణిపుర్‌ను హింసాత్మకంగా మార్చిన సంగతి తెలిసిందే. వారికి రిజర్వేషన్లు ఇవ్వొద్దని ఆదివాసీ తెగలు డిమాండ్ చేశాయి. మెయిటీ-లకు రిజర్వేషన్లు దక్కితే వారు తమ అటవీ ప్రాంతాల్లో ఆవాసాలు ఏర్పాటు-చేసుకోవడంతో పాటు- తమకు రావాల్సిన ఉద్యోగాల్లో వాటా తగ్గిపోతుందని వారు ఆందోళన చెందారు. ఆ నిరసనలకు చురాచంద్‌పుర్ కేంద్రమైంది. రాష్ట్రంలోని పలు అటవీ ప్రాంతాలను రిజర్వ్ ప్రాంతాలుగా ప్రకటించడంతో కొండలపై నివాసమున్నవారు ఆగ్రహం వ్యక్తంచేశారు. కనీసం పునరావాసం కల్పించ కుండా తమను తరలించడంపై నిరసన వ్యక్తంచేశారు. దీనికితోడు రిజర్వేషన్ల అంశం తెర పైకి రావడంతో నిరసనలు ఘర్షణ రూపం దాల్చాయి. ఆ క్రమంలో అమానవీయ ఘటనలు చోటుచేసుకున్నాయి. మణిపుర్‌లో చెలరేగిన అల్లర్లలో 250 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా కొన్ని వేల మంది నిరాశ్రయు లయ్యారు. పలువురి ఆస్తులు ధ్వంసమయ్యాయి. ఈ హింసపై సుప్రీంకోర్టు జోక్యం చేసుకుంది. అప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్న బీరెన్‌సింగ్ ఈ ఏడాది తన పదవికి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే.

జాతుల మధ్య హింస చెలరేగిన రెండు సంవత్సరాల తర్వాత శనివారం వెళ్లారు. ఈ పర్యటన దృష్ట్యా మణిపుర్ ప్రభుత్వం కట్టు-దిట్టమైన భద్రతా ఏర్పాట్లు- చేసింది. మిజోరం, మణిపుర్, అస్సాం, పశ్చిమ బెంగాల్, బిహార్‌లలో మోదీ పర్యటన సాగనుంది.

మిజోరం పర్యటన అనంతరం ప్రధాని మణిపూర్‌కు బయలుదేరి వెళ్లనున్నారు. అక్కడ చురచంద్‌పూర్, ఇంఫాల్‌లలో సుమారు రూ. 8,500 కోట్ల విలువైన 31 ప్రాజెక్టులను ప్రారంభించనున్నారు.

# విశాఖ స్టీల్‌పై లెఫ్ట్ పార్టీల దుష్ప్రచారం

విశాఖపట్నం, **సెప్టెంబర్ 13ఆంధ్ర ప్రగతి** గత జగన్ ప్రభుత్వం మూడు రాజధానుల పేరుతో డ్రామాలు ఆడిందని,దీనిని ప్రజలు అప్పుడే ఎలా మరచిపోతారని బీజేపీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాంతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి వ్యవహారించారని ధ్వజమెత్తారు. వైసీపీ ప్రభుత్వం మైనార్టీల నిధులను దారి మళ్లించిందని ఆరోపించారు. శనివారం విశాఖపట్నంలో పీవీఎన్ మాధవ్ పర్యటించారు. ఈ సందర్భంగా మీడియాతో మాధవ్ మాట్లాడారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించడంతో పురోభివృద్ధి చెందుతోందని అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌పై వామపక్ష పార్టీల దుష్ప్రచారాన్ని నమ్మొద్దని అన్నారు. విశ్వాఖ ప్లాంట్‌కు ఎలాంటి ధోకా లేదన్నారు. అమ్మడం అన్న పరిస్థితి లేకుండా ఆర్థిక సాయంతో కేంద్రం ఆదుకుందని అన్నారు. పోలవరం ప్రాజెక్ట్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఎన్డీఏ సారథ్యంలో పోలవరం ప్రాజెక్టు పూర్తవుతుంది. అమరావతి రాజధాని నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. ప్రైవేటీకరణను ఒక భూతంలా చూపించే ప్రయత్నం చేస్తున్నారు. ప్రైవేటీకరణ అనేది అన్ని దేశాల్లోనూ జరుగుతోంది. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని మొదట కోరింది బీజేపీనే. విశాఖ ఉక్కు పరిశ్రమలో ఏదో జరిగిపోతోందని కొంతమంది అపోహలు సృష్టిస్తున్నారు. స్టీల్ ప్లాంట్ విషయంలో జరుగుతున్న మంచిని ఎందుకు బయటకు చెప్పడం లేదని పీవీఎన్ మాధవ్ ప్రశ్నల వర్షం కురిపించారు. విశాఖలో సారథ్యం భారీ బహిరంగ సభ నిర్వహించనున్నామని... ఈ సభకు బీజేపీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డా ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని తెలిపారు. విశాఖలోని రైల్వే మైదాన వేదికలో ఈ సభ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు పీవీఎన్ మాధవ్. సారథ్యం యాత్ర బహిరంగ సభలో బీజేపీలోని ప్రతి కార్యకర్తను భాగస్వామ్యం చేస్తున్నామని వివరించారు. కడప నుంచి సారథ్యం యాత్ర ప్రారంభించామని గుర్తుచేశారు. సారథ్యం యాత్రకు రాష్ట్ర వ్యాప్తంగా విశేష స్పందన వచ్చిందని చెప్పుకొచ్చారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీని స్ఫూర్తిగా తీసుకుని బీజేపీలోని ప్రతి కార్యకర్త పని చేయాలనే విధంగా సారథ్యం యాత్ర చేపట్టామని వెల్లడించారు. సారథ్యం యాత్రలో వైతాలికులను గుర్తించి వారిని స్మరించుకున్నామని తెలిపారు. సారథ్యం యాత్రలో చాయ్ పై చర్చ కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందని పేర్కొన్నారు పీవీఎన్ మాధవ్. కేంద్ర ప్రభుత్వ పథకాలు పూర్తి స్థాయిలో ప్రజలకు అందుతున్నాయి. అక్టోబర్ 2తేదీన ఏపీవ్యాప్తంగా ఖాదీ సంతలను నిర్వహిస్తాం. నెక్స్ట్ జనరేషన్ జీఎస్టీ సాహసోపేతమైన నిర్ణయం. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో అనేక రకాల వస్తువుల ధరలు తగ్గనున్నాయి. సెప్టెంబర్ 17వ తేదీన కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ విశాఖపట్నంలో పర్యటిస్తారు. అనంతపురంలో జరిగిన సూపర్ సిక్స్ సూపర్ హిట్ సభ విజయవంతమైంది. విశాఖలో 'సారథ్యం' బహిరంగ సభను ఆదివారం నిర్వహించనున్నట్లు మాధవ్ తెలిపారు. ఈ సభకు పార్టీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డాతో పాటు-.. రాష్ట్ర నేతలు హాజరవుతున్నారు. విశాఖలోని రైల్వే మైదానం వేదిక ఈ సభ జరగనుంది. 'సారథ్యం' బహిరంగ సభలో విశాఖలోని పార్టీ ప్రతి కార్యకర్తను భాగస్వామ్యం చేస్తున్నట్లు- మాధవ్ తెలిపారు. కడప నుంచి సారథ్యం యాత్ర ప్రారంభించాం. రాష్ట్ర వ్యాప్తంగా విశేష స్పందన వచ్చింది. ఈ యాత్రలో చాయ్‌పే చర్చ కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందని మాధవ్ పేర్కొన్నారు.

# కృష్ణా జలాల్లో న్యాయమైన వాటాను సాధించి తీరాలి

(మొదటి పేజి తరువాయి)

ఈ నెల 23 నుంచి 25 వరకు ఢిల్లీలో కృష్ణా జల వివాదాల ట్రైబ్యునల్ విచారణ జరగనున్న నేపథ్యంలో, ట్రైబ్యునల్ ముందు వినిపించాల్సిన వాదనలపై నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కృష్ణా జలాల్లో తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన నీటి వాటాను సాధించేందుకు గట్టిగా పట్టుబట్టాలని అధికారులకు సూచించారు. రాష్ట్ర ప్రయోజనాలను పరిరక్షించేందుకు అవసరమైన బలమైన వాదనలను వినిపించాలని ఆయన అన్నారు. కృష్ణా నదిపై చేపట్టిన ప్రాజెక్టుల వివరాలన్నింటినీ ట్రైబ్యునల్ ముందుంచాలని ఆదేశించారు. గతంలో సరైన శ్రద్ధ కనబరచకపోవడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని ఆయన అన్నారు.కృష్ణా జలాల్లో వాటా సాధించడంలో కేసీఆర్ విఫలమయ్యారని, నీటి వాటాల విషయంలో ఆయన తెలంగాణకు ద్రోహం చేశారని విమర్శించారు. పాలమూరు, దిండి వంటి అనేక ప్రాజెక్టులను పెండింగ్‌లో ఉంచారని ఆరోపించారు.

# ఎపిలో పలువురు ఐపిఎస్‌ల బదిలీ

అమరావతి **సెప్టెంబర్ 13ఆంధ్ర ప్రగతి**

మొన్న ఐఎఎస్‌లను బదిలీచేసిన ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ లో పలువురు ఐపీఎస్ అధికారులను బదిలీ చేసింది. 14 జిల్లాలకు కొత్త ఎస్పీలను నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ శనివారం ఆదేశాలు జారీ చేశారు. కాగా, వీటిలో ఏడు జిల్లాలకు ఎస్పీలుగా కొత్త అధికారులను నియమించారు. అలాగే మరో ఏడు జిల్లాలకు ఇతర జిల్లాల ఎస్పీలను బదిలీ చేశారు. అదే విధంగా 12 జిల్లాల్లో ఉన్న వారినే ఎస్పీలుగా కొనసాగిస్తున్నట్లు- జారీ చేసిన ఉత్తర్వుల్లో సీఎస్ స్పష్టం చేశారు. తిరుపతి ఎస్పీగా గతంలో తొలగించిన సుబ్బారయుడుని తిరిగి నియమించారు. బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ: రాహుల్ మీనా, బాపట్ల జిల్లా ఎస్పీ: ఉమామహేశ్వర్,శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఎస్పీ: అజితా వేజెండ్ల,తిరుపతి జిల్లా ఎస్పీ: సుబ్బారాయుడు,అన్నమయ్య జిల్లా ఎస్పీ: ధీరజ్ కునుగిలి,వైఎస్ఆర్ కడప జిల్లా ఎస్పీ: నచికేత్, నంద్యాల జిల్లా ఎస్పీ: సునీల్ షెరాన్ కొత్త ఎస్పీలుగా నియమితులయ్యారు. విజయనగరం జిల్లా ఎస్పీ: ఎ.ఆర్.దామోదర్,కృష్ణా జిల్లా ఎస్పీ: విద్యాసాగర్ నాయుడు, గుంటూరు జిల్లా ఎస్పీ: వకుల్ జిందాల్, పల్నాడు జిల్లా ఎస్పీ: డి.కృష్ణారావు, ప్రకాశం జిల్లా ఎస్పీ: హర్షవర్ధన్ రాజు,చిత్తూరు జిల్లా ఎస్పీ: తుషార్ డూడి,శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ: సతీష్ కుమార్ వీరంతా ఈ జిల్లాలకు ఇతర జిల్లాల నుంచి బదిలీ చేయబడ్డారు. మరోవైపు శ్రీకాకుళం, పార్వతీపురం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, ఈస్ట్ గోదావరి, వెస్ట్ గోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, అనంతపురం, కర్నూలు జిల్లాల ఎస్పీలు యథాతథంగా కొనసాగుతారని ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల్లో ఉంది. ఇక, ఈ వారంలో రోజుల వ్యవధిలోనే రెండు దశల్లో పలువురు ఐఏఎస్ అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. ఆ వెంటనే ఐపీఎస్ అధికారులను కూటమి ప్రభుత్వం బదిలీ చేసింది.

# మధ్యతరగతి ప్రజల సొంతింటి కల సాకారానికి నిధిని ఏర్పాటుచేయండి

(మొదటి పేజి తరువాయి)

అవసరం ఉందని పేర్కొంది. అటువంటి వాటిని ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రత్యేక నిధి' ఏర్పాటుపై ఆలోచన చేయాలని, అలాంటి ప్రాజెక్టులను స్వాధీనం చేసుకోవడాన్నీ పరిశీలించాలని కేంద్రానికి సూచించింది. నివాస ప్రాజెక్టు విషయంలో ఓ వివాదానికి సంబంధించిన పిటిషన్‌ను జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ ఆర్ మహదేవన్‌లతో కూడిన సుప్రీం ధర్మాసనం విచారించింది. రియల్ డెవలపర్ల చేతిలో గృహ కొనుగోలుదారులు మోసపోకుండా లేదా దోపిడీకి గురికాకుండా పటిష్ఠమైన చర్యలు తీసుకునేందుకు ఓ ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించి, దాన్ని అమలు చేసే బాధ్యత ప్రభుత్వానిదేనని పేర్కొంది. దేశ పట్టణీకరణ విధానాలకు అనుగుణంగా ప్రాజెక్టులను సకాలంలో పూర్తిచేసేలా చూడాలని స్పష్టం చేసింది. రెరా ను 'కోరలు తీసిన పులి'గా మార్చొద్దని, అవసరమైన మౌలిక సదుపాయాలు, -ట్రైబ్యునళ్లు, సమర్థమంతమైన యంత్రాంగం ఉండాలని సుప్రీం ధర్మాసనం పేర్కొంది. అప్పుడే వారి ఆదేశాలు వేగంగా, కచ్చితంగా అమలు అవుతాయని అభిప్రాయపడింది. ఈ విషయంలో ప్రభుత్వం మౌనప్రేక్షకుడిగా ఉండకూడదని హితవు పలికింది. గృహ కొనుగోలుదారులు, ఆర్థిక వ్యవస్థ ప్రయోజనాలు కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని గుర్తుచేసింది. నిలిచిపోయిన ప్రాజెక్టులను గుర్తించి, స్వాధీనం చేసుకునేందుకు నేషనల్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమి-టె-డ్ (కఆఈర) లేదా సంబంధిత భాగస్వామ్య పక్షాలతో ఓ సంస్థను ఏర్పాటు- చేయడాన్ని పరిశీలించాలని సూచించింది.

# సుపరిపాలన వేళ వైషమ్యాల కుట్రలు

(మొదటి పేజి తరువాయి)

శనివారం అమరావతిలోని పార్టీ కార్యాలయంలో జనసేన శ్రేణులను ఉద్దేశించి డిప్యూటీ- సీఎం పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. సామాజిక మాధ్యమాల ముసుగులోనో.. యూట్యూబ్ ఛానెళ్ల పేరుతోనో.. మరో మార్గంలోనో కులాలు మధ్య, మతాల మధ్య చిచ్చుపెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా కుయుక్తులతో సమాజంలో అశాంతి, అభద్రత కలిగించే వ్యక్తుల నైజాన్ని గత పదేళ్లుగా చూస్తున్నామని ఆయన వివరించారు. వారి ఉచ్చులో పడి, ఆవేశాలకు లోనై, ఘర్షణ వాతావరణానికి తావీయ వద్దంటూ పార్టీ శ్రేణులకు ఆయన హితవు పలికారు. అలాంటి ఆవేశాలు ప్రదర్శిస్తే కుట్రదారులు ఆశించిన ప్రయోజనాలు నెరవేరుతాయన్నారు. ఆ క్రమంలో ఇటీ-వల మచిలీపట్నంలో చోటు- చేసుకున్న ఘటనను ఈ సందర్భంగా ఆయన ఉదాహరణగా వివరించారు. ఒక యూట్యూబ్ ఛానెల్‌లో వ్యక్తి అభ్యంతరకర భాష ఉపయోగించి మాట్లాడారని చెప్పారు. అతను ఆ విధంగా మాట్లాడేలా సిద్ధం చేసి.. ప్రచారం చేయడం వెనక ఉన్న కుత్సిత ఆలోచనను మనం పసిగట్టాల్సి ఉందని పార్టీ శ్రేణులకు డిప్యూటీ- సీఎం పవన్ కల్యాణ్ వివరించారు. ఈ అంశంపై చట్ట ప్రకారం కేసులు పెట్టి ముందుకు వెళ్ళాల్సి ఉందని సూచించారు. అంతేకానీ.. తొందరపడి మరో మార్గంలో వెళ్ళి ఘర్షణ పడటం ద్వారా సమస్య జటిలం అవుతుందని అభిప్రాయ పడ్డారు. కులాలు, మతాల మధ్య విభేదాలు తీసుకు వచ్చే విధంగా ప్రవర్తించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా ఫిర్యాదు చేయాల్సి ఉందంటూ పార్టీ శ్రేణులకు ఆయన స్పష్టం చేశారు. ఈ దిశగా ముందుకు వెళ్ళాలని జనసేన పార్టీ నేతలు, కార్యకర్తలతోపాటు- కూమిటీ-లోని నేతలను సీఎం పవన్ కల్యాణ్ వివరించారు. సోషల్ మీడియా, యూట్యూబ్ చానెల్స్ రూపంలోనో, విశ్లేషకుల ముసుగులోనో రెచ్చగొట్టే వారినీ, అభ్యంతరకర రీతిలో మాట్లాడే వారినీ భారత న్యాయ సంహిత ప్రకారం చట్టం ముందు నిలపాలని పేర్కొన్నారు. వీరి వెనక ఉండి.. వ్యవస్థీకృతంగా రెచ్చగొట్టి కుట్రలు చేసే వారిపైనా ఫిర్యాదు చేసి కేసులు నమోదు చేయించాలని పార్టీ కేడర్‌కు ఆయన సూచించారు. అయితే మచిలీపట్నం వివాదంపై అంతర్గత విచారణ జరపాలంటూ ఇప్పటికే పార్టీలోని నేతలకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చానని వెల్లడించారు. ఈ ఘటనలో పాలు పంచుకున్న వారికి నోటీ-సులు ఇచ్చి వివరణ తీసుకోవాలని కూడా ఇచ్చానని వివరించారు. కుట్రలు చేసే వారి కుత్సిత నైజం కలిగిన పార్టీ, ఆ పార్టీ నాయకుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ రాజకీయ పార్టీలు సోషల్ మీడియా ముసుగులో అనుసరిస్తున్న వైఖరిపై జనసేన పార్టీ కేడర్‌కు ఈ సందర్భంగా డిప్యూటీ- సీఎం పవన్ కల్యాణ్ అప్రమత్తం చేశారు.

# ఎన్డీయే ప్రభుత్వం ఒక్క హామీని కూడా అమలు చేయలేదు

(మొదటి పేజి తరువాయి)

"చంద్రబాబు ఇచ్చిన ఫేక్ వీడియోలతో మంత్రులు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. వారికి దమ్ముంటే నాతో పాటు వస్తే నిజమైన మెడికల్ కాలేజీలను చూపిస్తాను" అని సవాల్ విసిరారు. చంద్రబాబు తన సుదీర్ఘ పాలనలో ఒక్క మెడికల్ కాలేజీ కూడా కట్టలేదని ఆమె గుర్తుచేశారు.జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై రోజా ఘాటు వ్యాఖ్యలు చేశారు. ప్రజలు సమస్యలు పరిష్కరిస్తారని ఓట్లు వేస్తే, పవన్ మాత్రం సినిమా షూటింగులు చేసుకుంటూ, ప్రభుత్వ ధనంతో ప్రత్యేక విమానాల్లో తిరుగుతున్నారని విమర్శించారు. రాష్ట్ర సమస్యలను గాలికొదిలి, ప్యాకేజీల కోసం పనిచేస్తున్నారని ఆరోపించారు. "ఆయనకు ఓటు వేసినందుకు ప్రజలు ఇప్పుడు సిగ్గుపడుతున్నారు" అని అన్నారు.ప్రభుత్వాన్ని ఎవరైనా ప్రశ్నిస్తే వారిపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని రోజా మండిపడ్డారు. చంద్రబాబు. లోకేశ్ మెప్పు పొందడం కోసమే మంత్రులు సిగ్గులేకుండా అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు. జగన్ బెంగళూరులో ఉన్నారని విమర్శిస్తున్న టీడీపీ, జనసేన నేతలు.. గతంలో వారు ఓడిపోయినప్పుడు ఎక్కడ ఉన్నారో చెప్పాలని ఆమె ప్రశ్నించారు.

# కళారాధన పోటీలలో ఆకట్టుకునేలా కథలు చెప్పిన చిన్నారులు

మాతృభూమికి కళార్చన 13వ రోజు, డాక్టర్ రవి కృష్ణ క్విజ్ మాస్టర్ గా జూనియర్ క్విజ్ పోటీల నిర్వహణ.

జూనియర్ క్విజ్ పోటీలలో విజేతలుగా నిలిచిన గురురాజా,రోటరీ ఇంగ్లీష్ మీడియం,గుడ్ షెఫర్డ్, సత్య సాయి జట్లు.

స్పాట్ వక్తృత్వ పోటీలలో ఉపన్యాస ప్రతిభ చూపిన విద్యార్థులు.

ఆదివారం సాయంత్రం ఎన్టీఆర్ పురపాలక సెంటినరీ టౌన్ హాల్లో ముగింపు ఉత్సవం, బహుమతుల ప్రదానం.

ముగింపు ఉత్సవంలో దేశ నాయకుల వేషధారణ, సామాజిక చైతన్యం కలిగించే వేషధారణ పోటీలు.



కళారాధన పోటీలలో జూనియర్ క్విజ్ నిర్వహిస్తున్న డాక్టర్ రవి కృష్ణ

**ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 13:**
కళారాధన నంద్యాల ఆధ్వర్యంలో, నంద్యాల లయన్స్ క్లబ్, ఐఎంఏ ల సంయుక్త నిర్వహణలో,రాష్ట్ర సాంస్కృతిక శాఖ సృజనాత్మక సంస్కృతి సమితి సహకారంతో ఈ నెల 1వ తేదీ నుండి నిర్వహిస్తున్న మాతృభూమికి కళార్చన పోటీలలో భాగంగా శనివారం జూనియర్ విభాగంలో డాక్టర్ రవి కృష్ణ క్విజ్ మాస్టర్ గా, కళారాధన కార్యనిర్వాహక కార్యదర్శులు శ్రీకాంత్, రవి ప్రకాష్ ల నిర్వహణలో క్విజ్ పోటీలను నిర్వహించారు.

జరిగిన ఈ క్విజ్ పోటీలో 7 పాఠశాలల నుండి ఐదు మందితో కూడిన జట్లు పోటీ పడ్డాయి. దేశ స్వాతంత్ర ఉద్యమ చరిత్ర, గాంధీజీ జీవితం, క్రీడలు, సాంస్కృతిక రంగం, సైన్స్ అండ్ టెక్నాలజీ, చరిత్ర, సాహిత్యం వంటి అంశాలపై 8 రౌండ్లలో రెండు గంటలపాటు సాగిన క్విజ్ పోటీలో విద్యార్థులు అబ్బురపరిచేలా సమాధానాలు చెప్పి ప్రతిభను చాటుకున్నారు.

**జూనియర్ క్విజ్ పోటీ విజేతలు:**

గురు రాజా ఇంగ్లీష్ మీడియం స్కూల్,రోటరీ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రథమ,ద్వితీయ స్థానాలలో నిలవగా, గుడ్ షెఫర్డ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్, సత్యసాయి స్కూల్ తృతీయ స్థానం సాధించారు. చాణక్య ,జ్యోతిర్మయి, టేక్కే పురపాలక పాఠశాలల జట్లు స్పెషల్ జ్యూరీ బహుమతులు సాధించారు.

**కథ చెబుతా వింటారా.? పోటీలు:**

సబ్ జూనియర్ కేటగిరిలో మూడవ తరగతి లోపు బాల బాలికలు తెలుగు, ఆంగ్ల, హిందీ భాషలలో కథ చెప్పే పోటీలో వందమంది బాలలు చక్కటి హావభావాలతో, అకట్టుకునేలా కథలు వినిపించారు.

స్పాట్ వక్తృత్వ పోటీలలో ఉపన్యాస ప్రతిభ చూపిన విద్యార్థులు

**స్పాట్ వక్తృత్వ పోటీలో,**

"ప్రజాస్వామ్యంలో ఓటు ప్రాధాన్యత,నీ జీవిత లక్ష్యం ఏమిటి,లక్ష్యాన్ని ఎలా సాధించాలనుకుంటున్నారు, సోషల్ మీడియా ప్రయోజనాలు, దుష్పరిణామాలు" అనే మూడు అంశాలలో, తాము పాల్గొనడానికి ఐదు నిమిషాల ముందు ఏదో ఒకటి ఎంపిక చేసుకుని ఉపన్యాసం ఇచ్చే పోటీలో విద్యార్థులు తమ ఆలోచన శక్తిని పదును పెడుతూ, విషయపరిజ్ఞానాన్ని వినియోగించి చక్కటి ఉపన్యాసాలు ఇచ్చారు.

శనివారం జరిగిన కార్యక్రమాలలో న్యాయ నిర్ణేతలుగా అవ్వారి శేషఫణి,అన్నెం శ్రీనివాసరెడ్డి,నరేంద్ర, డాక్టర్ నీలం వెంకటేశ్వర్లు, మహబూబ్ బాషా,రబ్బాని,హుస్సేన్ మియా వ్యవహరించారు. పోటీల నిర్వహణలో కళారాధన ప్రధాన కార్యదర్శి డాక్టర్ కృష్ణ, కార్య నిర్వాహక కార్యదర్శి రవి ప్రకాష్ ,ఉపాధ్యక్షులు బవిరిశెట్టి శ్రీకాంత్, లయన్స్ క్లబ్ అధ్యక్షులు సోమేసుల నాగరాజు, కోశాధికారి అమిదేల జనార్ధన్,కార్యాలయ కార్యదర్శులు వెంకటేశ్వర్లు,ఆలా మధు,మజీద్,సూర్య, ఇస్మాయిల్, ముజామిల్ పాల్గొన్నారు.

**ఆదివారం మాతృభూమికి కళార్చన ముగింపు ఉత్సవం**

ఆదివారం సాయంత్రం ఎన్టీఆర్ పురపాలక సెంటినరీ టౌన్ హాల్లో మాతృభూమికి కళార్చన 25 వ సంవత్సరం ముగింపు ఉత్సవం నిర్వహిస్తారు. ఈనెల 1వ తేదీ నుండి నిర్వహించిన వివిధ పోటీల్లో 4,000 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీటిలో విజేతలుగా నిలిచిన 350 మందికి షీల్డ్ లు బహుమతులుగా అందజేస్తారు.

**ముగింపు ఉత్సవంలో వేషధారణ పోటీలు**

దేశ నాయకుల వేషధారణ, సామాజిక చైతన్యం కలిగించే వేషధారణ పోటీలు సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాలలో నిర్వహిస్తారు.



జూనియర్ క్విజ్ లో పాల్గొన్న పాఠశాలల జట్లు



జూనియర్ క్విజ్ పోటీల దృశ్యం



జూనియర్ క్విజ్ పోటీలో ప్రథమ స్థానంలో నిలిచిన గురురాజా స్కూలు విద్యార్థులు



జూనియర్ క్విజ్ పోటీలో ద్వితీయ స్థానంలో నిలిచిన సత్యసాయి స్కూల్ విద్యార్థులు



జూనియర్ క్విజ్ పోటీలో తృతీయ స్థానంలో నిలిచిన గుడ్ షెఫర్డ్ స్కూల్ విద్యార్థులు

# ఘనంగా ప్రారంభమైన రాష్ట్రస్థాయి చెస్ పోటీలు.

రాపిడ్, బ్లిట్జ్ విభాగాలలో రాష్ట్రస్థాయి చెస్ పోటీలు. పాల్గొంటున్న వివిధ జిల్లాల జట్లు.

రాష్ట్రస్థాయి పోటీలు ప్రారంభించిన డాక్టర్ రామకృష్ణారెడ్డి, డాక్టర్ రవి కృష్ణ.




ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి రాపిడ్, బ్లిట్జ్ చెస్ పోటీలు ప్రారంభిస్తున్న డాక్టర్ రామకృష్ణా రెడ్డి, డాక్టర్ రవి కృష్ణ.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 13:**
ఆంధ్ర చెస్ సంఘం ఆధ్వర్యంలో,నంద్యాల జిల్లా సంఘం నిర్వహణలో శని వారం నంద్యాలలో రామకృష్ణ డిగ్రీ కళాశాల వివేకానంద ఆడిటోరియంలో నంద్యాల జిల్లా సంఘం కార్యదర్శి రామసుబ్బారెడ్డి నిర్వహణలో, ముని నాగలక్ష్మి స్మారక రాష్ట్రస్థాయి రాపిడ్, బ్లిట్జ్ టోర్నమెంట్, ముని నాగలక్ష్మి సోదరుడు రాజేష్ సౌజన్యంతో ఘనంగా ప్రారంభమైంది. నంద్యాల జిల్లా చెస్ సంఘం అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ అధ్యక్షతన జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో రామకృష్ణ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ జి. రామకృష్ణారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని టోర్నమెంట్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా డాక్టర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ చదరంగం మెదడుకు పదును పెడుతుందని, ఈ క్రీడ వలన బాలలలో మానసిక వికాసం కలుగుతుందని, ఏకాగ్రత పెరుగుతుందని అన్నారు. డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ రెండు రోజులపాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయిలో రాపిడ్, బ్లిట్జ్ చెస్ ఛాంపియన్ షిప్ పోటీలు నిర్వహిస్తున్నామని, ఇందులో విజేతలుగా నిలిచిన వారు రాష్ట్ర సంఘం తరపున జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ పోటీలలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి క్రీడాకారులు పాల్గొంటున్నారని తెలిపారు. ఆంధ్ర చెస్ సంఘం సంయుక్త కార్యదర్శి ,నంద్యాల జిల్లా చెస్ సంఘం ప్రధాన కార్యదర్శి, టోర్నమెంట్ నిర్వాహకులు రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ ఆది వారం సాయంత్రం ముగింపు ఉత్సవంలో విజేతలకు పతకాలు, ట్రోఫీలు బేతంచెర్ల పాలిటెక్నిక్ కళాశాల ఓ ఎస్ డి రాజేష్ సౌజన్యంతో బహూకరించడం జరుగుతుందని తెలిపారు. సభానంతరం డాక్టర్ జి. రామకృష్ణారెడ్డి, డాక్టర్ రవి కృష్ణ చెస్ బోర్డు పై పావులు కదిపి చదరంగం పోటీలను లాంచనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టోర్నమెంట్ స్పాన్సర్ రాజేష్, నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షులు సోమేసుల నాగరాజు కోశాధికారి అమిదేల జనార్ధన్, డాక్టర్ నీలా ప్రసాద్,ఆంధ్ర రాష్ట్ర చెస్ సంఘం సంయుక్త కార్యదర్శి మరియు జిల్లా చెస్ సంఘం ప్రధాన కార్యదర్శి రామసుబ్బారెడ్డి, టోర్నమెంట్ నిర్వాహకులు సుజాత, జిల్లా చెస్ సంఘం ప్రతినిధులు రాజా రమేష్ చక్రవర్తి, ఇమామ్,కర్నూలు జిల్లా చెస్ ప్రెసిడెంట్ రాకేష్ రెడ్డి,
ప్రకాశం జిల్లా చెస్ ప్రెసిడెంట్ కొండారెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు,రాష్ట్రం నలుమూలల నుండి వచ్చిన చదరంగం క్రీడాకారులు, వారి తల్లిదండ్రులు, కోచ్ లు పాల్గొన్నారు.

# వెంగల్ రెడ్డి నగర్ నందు గ్రామసభ.

## ఆత్మకూరు డిఎస్పి రామంజినాయక్.




**ఆంధ్ర ప్రగతి ఆత్మకూరు సెప్టెంబర్ 13:**
నంద్యాల జిల్లాలోని అన్ని స్టేషన్ల పరిధిలో గ్రామసభలు /పల్లె నిద్ర నిర్వహించాలన్న నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాలమేరకు ఆత్మకూరు డిఎస్పి రామంజి నాయక్ ఆధ్వర్యంలో ఆత్మకూరు ఇన్స్పెక్టర్ రాము మరియు సిబ్బందితో ఆత్మకూరు టౌన్ లో వెంగల్ రెడ్డి నగర్ నందు గ్రామసభ నిర్వహించడమైనది. ఈ సందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ సైబర్ క్రైమ్ నేరాలు నియంత్రించాలంటే ముందుగా ప్రజలు స్వీయ నియంత్రణ పాటించాలని, ఎవరైనా సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయినట్లయితే 1930 కి ఫోన్ చేసి తక్షణ సహాయం పొందవచ్చునని తెలియజేశారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణలో భాగంగా ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత మరియు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మోటర్ సైకిల్ పై ప్రయాణించే వారు తప్పనిసరి హెల్మెట్లు ధరించాలని, హెల్మెట్లు ధరించకపోతే అనుకోని విధంగా ఏదైనా ప్రమాదం జరిగితే చనిపోయి ప్రమాదం ఉందని తెలియజేశారు. బాల్య వివాహాల గురించి తెలియజేసి యుక్త వయసు వచ్చేవరకు బాగా చదువుకోవాలని బాల్యవివాహాలు చేసుకోకూడదని, వాళ్ళ వివాహాలు చేసుకోవడం వలన అనారోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని తెలియజేయడమైనది. దొంగతనాలు గురించి తెలియజేసి మీ దగ్గర బంగారు ఆభరణాలు విలువైన వస్తువులు డబ్బులు ఉన్నట్లయితే బ్యాంకు నందు లాకర్లో ఉంచుకోవాలని వారికి తెలియజేయడమైనది. ఎవరికైనా సమస్యలు ఉన్నట్లయితే ముందుగా పోలీస్ స్టేషన్ కు గాని డిఎస్పీ సర్ ఆఫీసుకి గాని పచ్చి పోలీస్ అధికారులను సంప్రదించాలని తెలియజేయడమైనది.

# రజకులపై దాడులను ఆపాలని మంత్రి ఫరూక్ కు వినతిపత్రం.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 13:**నంద్యాల పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు ఆల్ ఇండియా ధోబి మహాసంగ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు మరియు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జిల్లెల్ల శ్రీరాములు ఆధ్వర్యంలో రజక సంఘం నాయకులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లెల్ల శ్రీరాములు మాట్లాడుతూ రజకులపై జరుగుతున్న దాడులను ఆపాలని, రజకులకు రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని , దోబీ ఘాట్లను ఏర్పాటు చేయాలని, రజకుల ఇంటికి 300 యూనిట్స్ కరెంటు ఉచితంగా ఇవ్వాలని, రజకులకు అవసరమైన పనిముట్లను కార్పొరేషన్ ద్వారా అర్హులైన వారికి అందించాలని, అలాగే దేవాలయాలలో డివిటిలు (లాంతర్లు పట్టేవాళ్ళు) రజకులకు దేవస్థానం కమిటీ మెంబర్ గా అవకాశం ఇవ్వాలని వినతి పత్రంలో కోరారు. ఈ విషయాలపై మంత్రి ఫరూక్ సానుకూలంగా స్పందిస్తూ పై విషయాలన్నీ సంబంధిత శాఖ అధికారులకు తెలియజేస్తానని అదేవిధంగా మంత్రి నారా లోకేష్ దృష్టికి కూడా తీసుకొని వెళ్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్, సొసైటీ అధ్యక్షుడు యాలూరు వెంకట్ రెడ్డి, నంద్యాల మార్కెట్ యార్డ్ చైర్మన్ గుంటుపల్లి హరిబాబు, వీర సింహారెడ్డి, అఖిల భారత రజక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సుబ్రహ్మణ్యం, గోస్పాడు మండలాధ్యక్షుడు గుండు బాపుల మద్దిలేటి, జిల్లా కార్యదర్శి జూటూరు వెంకటేశ్వర్లు, నాగయ్య, లక్ష్మయ్య, రమణ, శివ,గుర్రప్ప తదితరులు పాల్గొన్నారు.

# ముస్లిం హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో నిత్యావసర వస్తువుల పంపిణీ.




**ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 13:**
నంద్యాల పట్టణంలోనీ 17వ వార్డ్ విశ్వనగర్ కు చెందిన ఓ నిరుపేద మహిళా వివాహ కార్యక్రమానికి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో,మేము ఉన్నాము అంటూ ముస్లిం హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో శనివారం పేద ముస్లిం మహిళలకు నిత్యావసర వస్తువులను అందజేశారు. ముస్లిం హక్కుల పోరాట సమితి ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు కరాటే మాభాష, గౌరవ అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్, సయ్యద్ హసన్ లను ముస్లిం మహిళ సంప్రదించడంతో వెంటనే స్పందించిన ముస్లిం హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో దాతల ఆర్థిక సహకారం ద్వారా వివాహానికి అవసరమైన నిత్యావసర వస్తువులను అందజేసి ఆదుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ముస్లిం హక్కుల పోరాట సమితి నాయకులు మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో నిరుపేద ముస్లిం కుటుంబాలకు అండగా వుంటామని తెలిపారు. పేద ముస్లింలు ఎవరైనా విద్యా, వైద్యం,పెళ్లి, ఆర్థిక ఇబ్బందులు ఉన్న ముస్లింలు ముస్లిం హక్కుల పోరాట సమితినీ ఆశ్రఇస్తే , దాతల ఆర్థిక సహకారం ద్వారా పేద ముస్లింలను ఆదుకోవడం జరుగుతుందని తెలిపారు.

# హిందీ భాషకు అంకితభావంతో సేవలందించిన నిజమైన హీరో శేఖ్ హుస్సేన్ బాషా



**ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 13:**
సెప్టెంబర్ 14న మన దేశం హిందీ దివస్ జరుపుకుంటున్న సందర్భంలో, హిందీ భాషను ప్రజలకు దగ్గర చేసిన ఒక నిజమైన శ్రద్ధావంతుడిని స్మరించుకోవాలి. ఆయనే శేఖ్ హుస్సేన్ బాష, హుస్సేన్ బాషా కేవలం ఉపాధ్యాయుడే కాదు %-% ఆయన ఒక గురువు స్వరూపం, ఒక మార్గదర్శకుడు, ఒక మిత్రుడు. హిందీ ఉపాధ్యాయుడిగా తన ప్రయాణాన్ని ప్రారంభించి, అనేక పాఠశాలల్లో కష్టపడి పనిచేశారు. విద్యార్థులకు హిందీ భాషను పూర్తిగా బోధించడమే ఆయన ప్రధాన లక్ష్యం. కేవలం బోధనే కాకుండా, విద్యార్థులు అర్థం చేసుకునే వరకు ఓర్పుతో నేర్పించేవారు. తనకు ఎటువంటి పెద్ద సహాయం లేకపోయినా, అద్భుతమైన కష్టపడి పనిచేసే తత్వం ఆయనను ప్రత్యేకంగా నిలబెట్టింది. చిన్నప్పటినుంచి ఆయనకు హిందీపై ఆసక్తి పెంచిన గురువు సయ్యద్ ఇస్మాయిల్ . ఆయన ప్రేరణతో హుస్సేన్ బాషా జీవితమంతా హిందీ భాషకు సేవ అంకితం చేశారు. విద్యార్థులు మాత్రమే కాదు, ఆయనను కలిసిన ప్రతి ఒక్కరూ ఆయనను కుటుంబసభ్యుడిలా, స్నేహితుడిలా భావించారు. సమాజంలో గౌరవం పొందిన వ్యక్తిగా, తన కృషి వల్ల అందరికి ఆదర్శంగా నిలిచారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# గిరిజన హక్కుల పరిరక్షణకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలి.

**ఆంధ్ర ప్రగతి కర్నూలు సెప్టెంబర్ 13:** మైదాన ప్రాంత గిరిజనులకు అన్యాయం జరుగుతోందని,మైదా న ప్రాంత గిరిజనులకు అసెంబ్లీలో ప్రాతినిధ్యం కల్పించాలని శనివారం ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు రాగిరి చంద్రప్ప, కోడుమూరు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి అనంతరత్నం,గిరిజన సంఘాల చైర్మన్ రామస్వామి, లంబడా జాతీయ అధ్యక్షులు యోగేష్ నాయక్ లు మాట్లాతూ రాష్ట్రంలోని మైదాన ప్రాంత గిరిజనులకు రాజకీయ రిజర్వేషన్ కల్పించి, గిరిజన హక్కుల పరిరక్షణకై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని అన్నారు. దేశానికి స్వాతంత్రం వచ్చి 78 సంవత్సరాలు కావస్తున్న నేటికీ రాష్ట్రంలోని లక్షలాదిమంది గిరిజనులకు కనీసం కూడు గూడు నీడ లేక పరితపిస్తున్నారని, ఇప్పటికీ రేషన్ కార్డు, ఆధార్ కార్డు లేక దుర్భరమైన జీవితాలు జీవిస్తున్నారని అన్నారు. ఆధార్ కార్డు లేకపోవడం వల్ల ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరం అవుతున్నారని చెప్పుకొచ్చారు. అంతేకాకుండా గిరిజన జాతీ అభివృద్ధికి ప్రతి ఏటా



ప్రభుత్వాలు కేటాయించే కోట్లాది రూపాయలు నిధులను దారి మళ్లించకుండా వినియోగించబడాలంటే చట్టసభలలో గిరిజనుల తరఫున ప్రాతినిత్యం వహించే వ్యక్తి ఉండాలన్నారు. అందుకొరకై గిరిజన హక్కుల సంరక్షణ కొరకై సంగటితంగా మనమంతా కలిసికట్టుగా ఐక్యమత్యంతో ఉద్యమించాలన్నారు. మైదాన ప్రాంత గిరిజన తెగలలో ప్రధానంగా ఎరుకలి,సుగాలి, చెంచు, యానాది ఇలా అనేక జాతులు ఉన్నారన్నారు. వీరందరికీ సరైన సమాన ప్రాతినిధ్యం లేదన్నారు.రాష్ట్రంలోని గిరిజనులకు రాజకీయంగా మన్యం ప్రాంతాలకు పరిమితం చేయటం వలన మైదాన ప్రాంత గిరిజనులకు గత 58 సంవత్సరాలుగా జరగవలసిన అన్యాయం భారీగా జరిగిపోయిందన్నారు. ఇకనైనా మేలుకొని మన హక్కులను కాపాడుకునేందుకు కృషి చేయాలన్నారు. ఏ ప్రభుత్వం వచ్చినా ఎస్టీ జాబితాలోకి ఇతర కులాలను చేర్చే ప్రతిపాదనను తీసుకోరాటం చాలా బాధాకరంగా ఉందన్నారు. అభివృద్ధికి నోచక ఇప్పటికీ దిక్కులేని స్థితిలో గిరిజన ప్రజానీకం జీవిస్తున్నారనే విషయాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గ్రహించాలన్నారు.2026 సంవత్సరంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వంలో శాసనసభ స్థానాలు 175 నుంచి 225 పెంపునకు కొత్తగా ఏర్పాటు కానున్న ఆ నియోజకవర్గాలలో రాష్ట్ర జనాభాలో సగ భాగంగా ఉన్న మైదాన ప్రాంత గిరిజనులకు సామాజికంగా, ఆర్థిక, రాజకీయ ఉద్యోగ రంగాలలో ప్రాతినిత్యం కల్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎన్ టి ఎఫ్ జిల్లా అధ్యక్షులు కుశలన్న తదితరులు పాల్గొన్నారు.

# మహానందిలో ప్రబలుతున్న వ్యాధులు..

# భయాందళనలో ప్రజలు.

## పీజీఆర్ఎస్లో ఫిర్యాదు చేసిన అధికారుల చర్యలు శూన్యం.

**ఆంధ్ర ప్రగతి మహానంది సెప్టెంబర్ 13:** మహానంది మండలం గాజులపల్లి గ్రామంలోని పలు విధుల్లో డ్రైనేజీ కాలువలు మురుగు పారుదల లేకపోవడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వర్షాలు కురిసినప్పుడు ప్రజల అవస్థలు వర్ణాతీతం. అదేవిధంగా మెట్ట యందు డ్రైనేజీ సమస్యతో ప్రతిరోజు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. డ్రైనేజీ మురుగు కాల్వ ముందుకు సాగే విధంగా లేకపోవడంతో మురుగునీరు రోడ్డుపై ప్రవహించడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. వర్షాలు కురిసినప్పుడు డ్రైనేజీ మురుగు నీరు ముందుకు సాగే విధంగా లేకపోవడంతో ఇళ్లల్లోకి వచ్చి తీవ్ర అవస్థలు పడుతున్నారు.ప్రభుత్వాలు పాలకులు మారిన డ్రైనేజీ సమస్య గురించి పట్టించుకునే నాధుడే కరువయ్యారని వాపోతున్నారు. డ్రైనేజీ కాలువ లేక సీజన్తో సంబంధం లేకుండా మురికినీరు రోడ్డుపై నిత్యం ప్రవహిస్తూ ఉంటుంది.దీంతో నిత్యం ప్రజలు దుర్వా సనతో, రోగాలతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను పరిష్కరించేవారు లేరా అంటూ ఆవేదన



వ్యక్తం చేస్తున్నారు.అండర్ గ్రౌండ్ డ్రైనేజీ లేక పారే మురికి నీటిలో దోమలకు ఈగలకు ఆవాసాలుగా మారి దుర్వాసనతో ప్రజలు రోగాల బారిన పడుతూ ఇబ్బందులు పడుతున్నారు.ఈ అస్తవ్యస్త డ్రైనేజీ కారణంగా స్థానికులు ప్రతి రోజూ మురుగు నీటి మధ్య సహజీవనం సాగిస్తున్నారు. దీంతో రోగాలకు గురవుతున్న పరిస్థితులు దాపరిస్తున్నాయి. అధికారులు మాత్రం ఇలాంటి వాటిపై ఏమాత్రం దృష్టి పెట్టడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. ఎవరైనా ప్రజలు విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారి నుంచి ఎలాంటి స్పందన కనిపించడం లేదు. ప్రజల సమస్యలు పరిష్కరించడంలో అధికారులు పూర్తిగా వైఫల్యం చెందడానికి ఈ ఘటనే నిదర్శనం. ఇప్పటికైనా అధికారులు మురుగు నీరు నిల్వ ఉండకుండా వెళ్లే మార్గం దిశగా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.డ్రైన్లు అసంపూర్తిగా ఉండటంతో డ్రైనేజీ మురుగునీరు పారుదల ముందుకు సాగే విధంగా లేకపోవడంతో, ఎక్కడి నీరు అక్కడే నిలబడి దుర్గంధం వెదజల్లుతుందన్నారు. వర్షాలు కురిసినప్పుడు డ్రైనేజీ లోని మురుగునీరు ఇళ్లల్లోకి చేరి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. దీంతో దోమల దోమల విజృంభన ఎక్కువైంది. ఈ డ్రైనేజీ మురుగునీరు నిలబడిపోవడంతో, దోమలు బాగా వృద్ధి చెంది, రోగాల బారిన పడుతున్నారని తెలిపారు.గ్రామాల పరిశు భ్రత లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన స్వచ్ఛభారత్, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమానికి అత్యధిక ప్రాధాన్యత కల్పిస్తున్న జిల్లా యంత్రాంగం మాత్రం ఆ దిశగా దృష్టి సారించడం లేదు అని చర్చించుకుంటున్నారు. నంద్యాల-గాజులపల్లె రహదారిలోని ఆర్ అండ్ బి అధికారులు నిర్మించిన డ్రైన్లు అసంపూర్తిగా నిర్మించడంతో, మురుగునీరు నిలబడి పోవడంతో స్థానికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఎటు చూసినా చెత్త చెదారంతో పేరుకో పోయి దోమలకు ఆవాసంగా మారి మలేరియా, డెంగ్యూ ఇతర సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని వాపోతున్నారు. ఈ విషయాన్ని ప్రజా ప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చలనం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా ఉన్నత అధికారులు ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని డ్రైనేజీ మురుగునీరు పారుదల ముందుకు సాగే విధంగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

# ప్రభుత్వ వైద్య కళాశాలల పిపిపి లీజు నిర్ణయాన్ని తక్షణమే రద్దు చేయాలి.!

## పిడిఎస్యూ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ఎండి.రఫీ డిమాండ్.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 13:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ 4, 2025న చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో 17 కొత్త వైద్య కళాశాలలలో పదింటిని పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యం (పిపిపి) పద్ధతిలో నిర్వహించాలని నిర్ణయించడం ఆందోళనకరం. ఆదోని, మదనపల్లె, మార్కాపురం, పులివెందుల, పెనుకొండ, పాలకొల్లు, అమలాపురం, నర్సీపట్నం, బాపట్ల, పార్వతీపురం కళాశాలలను 33 సంవత్సరాల లీజుకు ప్రైవేటు సంస్థలకు ఇవ్వడం ద్వారా 1500 ఎంబీబీఎస్ సీట్లు ప్రభావితమవుతాయి. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్ కోటాను 50% తగ్గించి, 50% సీట్లను మార్కెట్ రేట్లతో విక్రయించడం వల్ల ఫీజులు అమాంతం పెరుగుతున్నాయి. జగన్ ప్రభుత్వం నాబార్డ్ నిధులతో 8500 కోట్లతో 17 కళాశాలల నిర్మాణానికి చొరవ



తీసుకున్నప్పటికీ, 2023లో విజయనగరం, రాజమండ్రి, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాలలో 5 కళాశాలలు మాత్రమే ప్రారంభమయ్యాయి. కూటమి ప్రభుత్వం 2024లో పులివెందులను తిరస్కరించి, 80% నిర్మాణం పూర్తైన 10 కళాశాలల్లో ఎంబిబిఎస్ సీట్లను రద్దు చేయమని ఎన్ఎంసికి లేఖ రాసింది. ఇది పేద విద్యార్థులకు తీవ్ర నష్టం కలిగిస్తోంది. గత వైసీపీ ప్రభుత్వం జీవో 107, 108 ద్వారా సెల్ఫ్-ఫైనాన్స్ కోటాను ప్రవేశపెట్టి, ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసింది. యువగళం పాదయాత్రలో నారా లోకేశ్ ఈ జీవోలను 100 రోజుల్లో రద్దు చేసి, 100% సీట్లను ప్రభుత్వ కోటాలో భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ హామీలు నీటిబుడగలయ్యాయి. 2027-28 నాటికి మదనపల్లె, ఆదోని, మార్కాపురం, పులివెందుల కళాశాలలను పిపిపిలో ప్రైవేటీకరణ చేయడం ద్వారా ఫీజులు ఏడాదికి 8 లక్షల వరకు, ఎంబిబిఎస్ కోర్సుకు అరకోటి రూపాయల వరకు ఖర్చవుతాయి. అదే ప్రభుత్వ కళాశాలలైతే 5 లక్షలతో సరిపోతుంది. ప్రభుత్వం పారదర్శకత లేకుండా, కన్సల్టెన్సీల ద్వారా కళాశాలలను కార్పొరేట్ సంస్థలకు అప్పగించే కుట్రలు పన్నుతోంది. చిత్తూరులో అపోలో సంస్థ ప్రభుత్వ ఆసుపత్రిని వినియోగిస్తూ కొత్త ఆసుపత్రి నిర్మించకపోవడం, ప్రైవేటు ఆసుపత్రుల్లో అధిక ఫీజులతో అరకొర వైద్యం అందడం సామాన్యులకు నష్టం కలిగిస్తోంది.ఈ పిపిపి మోడల్ విస్తరిస్తే అన్ని ప్రభుత్వ కళాశాలలను ప్రైవేటీకరణ చేసే ప్రమాదం ఉంది. పీడీఎస్యూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యవర్గం ఈ నిర్ణయాలను ఖండిస్తూ 10 కళాశాలల పిపిపి నిర్ణయాన్ని ఉపసంహరించాలని, ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రైవేటు కంపెనీలకు అప్పగించే నిర్ణయాన్ని రద్దు చేయాలని, జీవో 107, 108ను రద్దు చేసి 100% సీట్లను ప్రభుత్వ కోటాలో భర్తీ చేయాలని, 17 కళాశాలలను ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించాలని డిమాండ్ చేస్తోంది.

# వైద్య కళాశాలలో ప్రైవేట్ భాగస్వామ్యాన్ని పూర్తిగా ఉపసంహరించుకోవాలి.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 13:**రాష్ట్ర ప్రభుత్వము వైద్య కళాశాలలలో ప్రైవేటు భాగస్వామ్యాన్ని (పిపిపి విధానాన్ని) పూర్తిగా ఉపసంహరించుకోవాలని ప్రభుత్వమే వాటిని నిర్మించి నిర్వహించాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి టి.శివరాం,పట్టణ అధ్యక్షులు నక్కిశ్రీకాంత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.విద్యా వైద్యము ప్రభుత్వ రంగంలోనే ఉండాలని ఇప్పటికే సాధారణ విద్యలో 50 శాతానికి పైగా ప్రైవేటుపరం అయిందని వారు అన్నారు.వైద్య విద్య పేద,మధ్య తరగతి విద్యార్థులకు అందనంత దూరానికి వెళ్లిందని ఆరోగ్యశ్రీని కూడా ప్రైవేటు పరం చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందని రాష్ట్రంలో ఉన్న పది వైద్య కళాశాలలకు అదనంగా మరో 17 వైద్య కళాశాలను కేంద్ర ప్రభుత్వం కేటాయించినట్లు చెప్పారని వీటిలో పది కళాశాలలను పిపిపి విధానంలో చేపట్టాలని ఇటీవల మంత్రి వర్గం తీర్మానించడం జరిగిందని దీనివల్ల వైద్య కళాశాలలలో సీట్లు పేద,మధ్య తరగతి విద్యార్థులకు అందుబాటులో ఉండవని వారు అన్నారు.కళాశాలలతో పాటు వాటికి అనుబంధంగా




నిర్వహించే ఆసుపత్రులలో కూడా ప్రైవేటు భాగస్వామ్యం వల్ల పేదలకు ఉచిత వైద్యం కూడా అందే అవకాశం ఉండదన్నారు.కొత్తగా మంజూరైన వైద్య కళాశాలల నిర్మాణానికి అయ్యే ఖర్చు 60 శాతం కేంద్రమే భరిస్తుందని రాష్ట్ర ప్రభుత్వం కేవలం 40 శాతం మాత్రమే ఖర్చు చేయాల్సి ఉంటుందన్నారు.ఆ మాత్రం కూడా రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేయలేదా అని వారు ప్రశ్నించారు.పేదల ఆరోగ్యం కోసం వైద్య విద్య కోసం కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెబుతూనే పిపిపి విధానంలో ప్రైవేటు కళాశాలలను నిర్మిస్తామని ఒక వైపు చెబుతూ ప్రైవేటీకరణ చేయడం లేదని మరోవైపు చెబుతూ భిన్న ప్రకటనలతో ప్రజలను గందరగోళానికి గురి చేస్తున్నారని ఏది ఏమైనా పిపిపి విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు.ప్రజా పాలన అంటే ప్రజలపై భారాలు వేయకుండా ధరలు పెరగకుండా పేదలకు మధ్య తరగతి ప్రజలకు విద్యను,వైద్యాన్ని ప్రభుత్వం ఆధీనంలో ఉంచుకుంటూ వారికి సేవ చేయడమే అన్నారు.కానీ ఈరోజు రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వం పేదలకు మధ్యతరగతి ప్రజలకు అణగారిన వర్గాలకు వైద్యం మరియు విద్యను దూరం చేయడానికి అడుగులు వేయడం దుర్మార్గమని వెంటనే ఈ విధానాన్ని మార్చుకోవాలని లేకపోతే భవిష్యత్తులో ఈ ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకుంటుందని వారు స్పష్టం చేశారు.

# జిల్లాలో జమీయతే ఉలేమా హిందూ సేవలను కొనసాగిస్తాం.

## - జిల్లా అధ్యక్షులుగా ముఫ్తి రఫీ సాహెబ్.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్13:** ఉపాధ్యక్షులుగా అంజద్ భాష సిద్ధికి మౌలానా మహబూబ్ బాషా, గులాం ముస్తఫా కార్యదర్శిగా మౌలానా జాఫర్ సాదిక్ కోశాధికారిగా మౌలాలి సాహెబ్లను మిగతా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ప్రకటించడం జరిగింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ జమీయతే ఉలేమ హిందూ దేశవ్యాప్తంగా ముస్లిం సమస్యలపై పోరాడుతున్న సంస్థా అని అన్నారు. జిల్లావ్యాప్తంగా సమస్యలపై పోరాటాలు నిర్వహించడం జరుగుతుందని సేవా కార్యక్రమాలను కొనసాగించడం జరుగుతుందన్నారు. నంద్యాల జిల్లా ఇ మాముల సంఘం అధ్యక్షులు అంజద్ భాష మాట్లాడుతూ.. నూతన కార్యవర్గం ఎంపికకు సహకరించిన రాష్ట్ర మైనార్టీ శాఖ మంత్రి ఎన్ ఎండి ఫారుక్ జిల్లా టిడిపి ప్రధానకార్యదర్శి ఎన్ ఎండి ఫిరోజ్ టిడిపి నాయకులు ఎన్ఎండీ ఫయాజ్ కు కృతజ్ఞతలు తెలిపారు. మూడు సంవత్సరాల పాటు కమిటీ ఆధ్వర్యంలో సమిష్టిగా కృషిచేసి ముస్లిం సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు గతంలో జన్మియతేవులేమా చేసిన సేవా కార్యక్రమాలను యధావిధిగా కొనసాగిస్తామని అన్నారు. కార్యక్రమంలో నూతన కార్యవర్గ సభ్యులు మరియు జిల్లా ఇమాముల సంఘం నాయకులు మౌలానా ఇద్రిస్ మౌలానా ఇబ్రహీం మౌలానా అబ్దుల్ ఖాదీర్ మౌలానా అబ్దుల్ గఫూర్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తగా ఉండడమే శ్రీరామరక్ష.!

## -విద్యుత్ శాఖ ఏఈ ప్రభాకర్ రెడ్డి.

**ఆంధ్ర ప్రగతి మహానంది, సెప్టెంబర్ 13:** అల్పపీడనం ప్రభావంతో వర్షాలు కురుస్తున్నాయని విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని, రైతులు, విద్యుత్ వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖ ఏఈ ప్రభాకర్ రెడ్డి అన్నారు. శనివారం అయన మాట్లాడుతూ.. మహానంది మండలంలో కురుస్తున్న వర్షాల కారణంగా మీ దగ్గరలో కాని,మీ ఇంటిలో కాని ఎలాంటి విద్యుత్ పరికరాలను ఆరుబయట కరెంటు స్తంభాలను, తడి



చేతితో తాకవద్దని తెలిపారు. విద్యుత్ స్తంభాలు కూలడం, విద్యుత్ తీగలు తెగి పడడం వంటివి జరిగితే వెంటనే విద్యుత్ సిబ్బందికి సమాచారం అందజేయాలన్నారు.రైతులు వర్షాల వల్ల పంటపొలాల్లో విద్యుత్ మోటార్లు నీటిలో మునిగి ఉంటాయని, స్టార్టర్ బాక్సులు తడిసి ఉంటాయని, రైతులు వాటిని ముట్టుకునే ప్రయత్నం చేయరాదన్నారు. పశువులను మేపేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని,విద్యుత్ స్తంభాలకు కట్టరాదని, ఇంట్లో బట్టలను అరేసుకోవడానికి విద్యుత్తు తీగలను వాడరాదని తెలిపారు. ఉరుములు, పిడుగులు సంభవించినప్పుడు విద్యుత్ లైన్స్ క్రింద ఉండరాదని,మీ కనుచూపు మేర ఎక్కడైనా విద్యుత్ తీగలు తెగిపడిన వెంటనే మీ ఏరియా కరెంటు ఆఫీసుకి కాని,మీ యొక్క లైన్ మెన్ కు సమాచారం అందించి ప్రమాదాలను నివారించేందుకు సహకరించాలని తెలిపారు. పశువులు విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లు, తీగల వద్దకు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని, ప్రతి ఇంట్లో వైరింగ్ కోసం నాణ్యమైన ఉత్పత్తులను వినియోగించాలన్నారు. విద్యుత్ స్తంభాలు కూలడం, విద్యుత్ తీగలు తెగి పడడం వంటివి జరిగితే వెంటనే విద్యుత్ ఇబ్బందికి సమాచారం అందించాలన్నారు. అతుకులు గల పాత వైర్లకు బదులుగా కొత్త వైర్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉంటూ ప్రమాదాల బారిన పడకుండా అవగాహనతో జాగ్రత్తలు పాటించాలన్నారు. అప్రమత్తంగా లేకపోతే విద్యుదాఘాతానికి గురయ్యే ప్రమాదం ఉందని, విద్యుత్తు సమస్యలుంటే వెంటనే సంబంధిత సిబ్బంది దృష్టికి తీసుకురావాలని విద్యుత్ శాఖ ఏఈ ప్రభాకర్ రెడ్డి కోరారు.

# స్వాతంత్ర్య సమరయోధులు జతీంద్రనాథ్ దాస్ సేవలు చిరస్మరణీయం.

## సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి.

**ఆంధ్ర ప్రగతి డోన్ సెప్టెంబర్ 13:** డోన్ పట్టణంలో సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి ఆధ్వర్యంలో సెప్టెంబర్ 13న స్వాతంత్ర్య సమరయోధులు జతీంద్రనాథ్ దాస్ వర్ధంతి సందర్భంగా వారి చిత్ర పటానికి పూలమాల వేసి ఘణంగా నివాళి అర్పించారు. వారిని స్మరించుకున్నారు.ఈ సందర్భంగా ,సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి మాట్లాడుతూ.. మన దేశ స్వాతంత్ర్య సమరయోధులను, శాస్త్రవేత్తలను ,మహనీయులను, సమాజానికి సేవలు అందించిన ప్రతి ఒక్కరిని స్మరించుకుంటూ వారి అడుగుజాడల్లో నడవాలని సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి తెలిపారు.

జతిన్ దాస్ గా సుపరిచితుడైన జతీంద్రనాథ్ దాస్ 27 అక్టోబర్ 1904 కలకత్తాలో జన్మించారు. మన దేశ స్వాతంత్ర్య సమరయోధుడు.ఈయన చిన్నవయసు నుండి మన దేశంలో జరుగుతున్న అరాచకాలను సహించేవారు కాదు. మహాత్మా గాంధీ నడిపిన సహాయ నిరాకరణోద్యమంలో చురుగ్గా పాల్గొన్నాడు.ఇతడు కలకత్తాలోని విద్యాసాగర్ కాలేజిలో బి.ఎ.చదివే సమయంలో 1925 నవంబర్లో బ్రిటిష్ అగడాలను ఎదిరించిన కారణంగా అరెస్ట్ అయ్యి జైలులో ఉన్నాడు. అక్కడ రాజకీయ ఖైదీలపట్ల చూపుతున్న దురుసు ప్రవర్తనకు నిరసనగా నిరాహారదీక్ష చేపట్టాడు. 20రోజుల నిరాహారదీక్ష తరువాత జైలు సూపరింటెండెంట్ క్షమాపణ కోరడంతో ఇతడు దీక్ష విరమించాడు.మన దేశం పై బ్రిటిష్ వారి అగడాలను నిరంతరం ఎదురిస్తూనే ఉన్నారు. ఇతని విప్లవ కార్యకలాపాల కారణంగా ఇతడిని 1929 జూన్ 14 న అరెస్ట్ చేసి లాహెూర్ జైలులో పెట్టారు. లాహెూర్ జైలులో భారతీయ ఖైదీల పరిస్థితి చాలా దుర్భరంగా ఉండేది. వారు అనేక రోజులపాటు ఉతకని మాసిన దుస్తులను ధరించవలసి వచ్చేది. వంటశాలలో బొద్దింకలు, ఎలుకలు తిరుగుతూ ఆహార పదార్థాలను తినడానికి హానికరంగా మార్చేవి. భారతీయ ఖైదీలకు వార్తాపత్రికలను, వ్రాసుకోవడానికి కాగితాలు ఇచ్చేవారు కాదు. కానీ అదే జైలులో బ్రిటిష్ ఖైదీల పరిస్థితి దీనికి భిన్నంగా ఉండేది. జతీంద్రనాథ్ దాస్ ఈ పరిస్థితులను గమనించి యూరోపియన్ ఖైదీలకు



సమానంగా భారతీయ ఖైదీలకు సదుపాయాలను కల్పించాలని కోరుతూ మరికొందరు విప్లవకారులతో కలిసి ఆమరణ నిరాహారదీక్షను చేపట్టాడు.అ తర్వాత ఇతని దీక్ష 1929 జూలై 13 న ప్రారంభమై 63 రోజులపాటు కొనసాగింది. జైలు అధికారులు బలవంతంగా ఈయన దీక్షను ఇతరుల దీక్షను భగ్నం చేయడానికి ప్రయత్నించారు. చివరకు జైలు కమిటీ ఇతడిని బేషరతుగా విడుదల చేయాలని సిఫారసు చేసింది. కానీ ప్రభుత్వం దానిని త్రోసి పుచ్చుతూ బెయిల్ మీద విడుదల కావచ్చని సూచించింది. ఈయన 1929, సెప్టెంబరు 13వ తేదీన తుది శ్వాస విడిచాడు.విప్లవ వనిత దుర్గావతి దేవినేతృత్వంలో ఇతని అంతిమయాత్ర లాహెూర్ నుండి కలకత్తా వరకు రైలులో కొనసాగింది. వేలాదిమంది ఇతడికి శ్రద్ధాంజలి ఘటించడానికి రైల్వే స్టేషన్ కు తరలివచ్చారు. హౌరా రైల్వే స్టేషన్లో శవపేటికను సుభాష్ చంద్రబోస్ స్వీకరించి శవయాత్రకు నేతృత్వం వహించాడు. కలకత్తాలో రెండుమైళ్ళ పొడుగున ప్రజలు బారులు తీరి ఇతడికి తుది వీడ్కోలు చెప్పారు. జతిన్ దాస్ నిరాహారదీక్ష అక్రమ నిర్బంధాలపై ప్రతిఘటనలో ఒక కీలకఘట్టంగా నిలిచింది.దేశంలోని దాదాపు అందరు నాయకులు ఇతడి బలిదానానికి శ్రద్ధాంజలి ఘటించారు. సుభాష్ చంద్రబోస్ ఇతడిని"భారతదేశపు యువ దధీచి"గా అభివర్ణించాడు. మన దేశం కోసం ప్రాణాలు త్యాగం చేసిన మన దేశ స్వాతంత్ర సమరయోధులను అనుక్షణం స్మరించుకుంటూ వారి అడుగుజాడల్లో నడవాలని సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి కోరారు.

# మధ్యతరగతి ప్రజల సొంతింటి కల సాకారానికి నిధిని ఏర్పాటుచేయండి

## సుప్రీం ధర్మాసనం సూచన

న్యూఢిల్లీ, **సెప్టెంబర్ 13ఆంధ్ర ప్రగతి** పన్ను చెల్లించే మధ్యతరగతి ప్రజల్లో చాలా మంది సొంతింటి కలలు సాకారం కాకపోవడంపై సుప్రీం కోర్టు తీవ్రంగా స్పందించింది. ఇళ్ల కొనుగోలుదారుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టుల్లో నిధులను కేటాయించాల్సిన అవసరం ఉందని పేర్కొంది. అటువంటి వాటిని ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రత్యేక నిధి' ఏర్పాటుపై ఆలోచన చేయాలని, అలాంటి ప్రాజెక్టులను స్వాధీనం చేసుకోవడాన్నీ పరిశీలించాలని కేంద్రానికి సూచించింది. నివాస ప్రాజెక్టు విషయంలో ఓ వివాదానికి సంబంధించిన పిటిషన్‌ను జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ ఆర్ మహదేవన్‌లతో కూడిన సుప్రీం ధర్మాసనం విచారించింది. రియల్ డెవలపర్ల చేతిలో గృహ కొనుగోలుదారులు మోసపోకుండా లేదా దోపిడీకి గురికాకుండా పటిష్ఠమైన చర్యలు తీసుకునేందుకు ఓ ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించి, దాన్ని అమలు చేసే బాధ్యత ప్రభుత్వానిదేనని పేర్కొంది. దేశ పట్టణీకరణ విధానాలకు అనుగుణంగా ప్రాజెక్టులను సకాలంలో పూర్తిచేసేలా చూడాలని స్పష్టం చేసింది. రెరా ను 'కోరలు తీసిన పులి'గా మార్చొద్దని, అవసరమైన మౌలిక సదుపాయాలు, -ట్రైబ్యునళ్లు, సమర్థమంతమైన యంత్రాంగం ఉండాలని సుప్రీం ధర్మాసనం పేర్కొంది. అప్పుడే వారి ఆదేశాలు వేగంగా, కచ్చితంగా అమలు అవుతాయని అభిప్రాయపడింది. ఈ విషయంలో ప్రభుత్వం మౌనప్రేక్షకుడిగా ఉండకూడదని హితవు పలికింది. గృహ కొనుగోలుదారులు, ఆర్థిక వ్యవస్థ ప్రయోజనాలు కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని గుర్తుచేసింది. నిలిచిపోయిన ప్రాజెక్టులను గుర్తించి, స్వాధీనం చేసుకునేందుకు నేషనల్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమి-టె-డ్ (కఆఈఅర) లేదా సంబంధిత భాగస్వామ్య పక్షాలతో ఓ సంస్థను ఏర్పాటు- చేయడాన్ని పరిశీలించాలని సూచించింది.

# ఇంటర్ బోర్డు భూముల ఆక్రమణ

## ఆక్రమణలు కూల్చేసిన హైడ్రా

హైదరాబాద **సెప్టెంబర్ 13ఆంధ్ర ప్రగతి** రంగారెడ్డి జిల్లా శంషాబాద్ పరిధి సర్వే నంబర్ 217లోని 12 ఎకరాల భూమిలో చేపట్టిన అక్రమ నిర్మాణాలను హైడ్రా (అధికారులు కూల్చివేశారు. 2011లో ఈ భూములను బోర్డు ఆఫ్ ఇంటర్‌మీడియట్‌కు ప్రభుత్వం కేటాయించింది. వీటిని ఇటీవల ఓ నిర్మాణ సంస్థ కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టింది. ఈక్రమంలో ఫిర్యాదు అందుకున్న హైడ్రా చర్యలు తీసుకుంది. శనివారం పోలీసు బందోబస్తు మధ్య అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేసింది.

-------------

# నేపాల్ ప్రధాని సుశీల కర్కికి మోడీ అభినందనలు





ఇంఫాల్, **సెప్టెంబర్ 13ఆంధ్ర ప్రగతి** నేపాల్ తొలి మహిళా ప్రధానమంత్రిగా నియమితులైన సుశీల కర్కి కు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభినందనలు తెలిపారు. ఆమె నియామకం మహిళా సాధికారతకు ఒక ఉజ్వల ఉదాహరణ అని అన్నారు. నేపాల్ భారత్‌కు సన్నిహిత దేశమని, 140 కోట్ల భారత ప్రజానీకం తరఫున ఆమెకు అభినందనలు తెలియజేస్తున్నానని మణిపూర్ రాజధాని ఇంఫాల్‌లో మాట్లాడుతూ ప్రధాని అన్నారు.

------

# బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం

## ఎపిలో మోస్తరు వర్షాలు కురిసే ఛాన్స్



అమరావతి **సెప్టెంబర్ 13ఆంధ్ర ప్రగతి** : పశ్చిమ మధ్య, వాయవ్య బంగాళాఖాతం, ఉత్తరాంధ్ర-దక్షిణ ఒడిశా తీరాల్లో అల్పపీడనం కొనసాగుతోందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. ఇది 48 గంటల్లో దక్షిణ ఒడిశా, ఉత్తరాంధ్ర, దక్షిణ ఛత్తీస్‌గఢ్ మీదుగా పశ్చిమ వాయవ్య దిశగా కదిలే అవకాశం ఉందని వెల్లడించారు. దీనికి అనుబంధంగా ఛత్తీస్‌గఢ్, విదర్భ మీదుగా దక్షిణ మహారాష్ట్ర వరకు ద్రోణి కొనసాగుతోందన్నారు. వీటి ప్రభావంతో రాష్ట్రంలో ఆదివారం అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసేందుకు అవకాశం ఉందని తెలిపారు. లోతట్టు- ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చెట్ల కింద నిలబడరాదని సూచించారు. ఆదివారం శ్రీకాకుళం, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, గుంటూరు, బాపట్ల, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. మిగతా జిల్లాల్లో కొన్నిచోట్ల తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు.



# నిండుకుండలా గాజులదిన్నె

కర్నూలు,సెప్టెంబరు13 (ఆర్ఎన్ఎ): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు కర్నూలు జిల్లాలోని ప్రధాన జలాశయమైన గాజుల దిన్నె ప్రాజెక్టుకు భారీగా వరద వచ్చి చేరుతోంది. మూడేళ్ల తర్వాత ఈ ప్రాజెక్టు నిండింది. ఇన్‌ఫ్లో పెరగడంతో మూడు గేట్లు- ఎత్తి 10,000 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. నిండుకుండలా ఉన్న జలాశయాన్ని చూసి రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. లోతట్టు- ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

## శిరివెళ్ల మసీద్ కమిటీ చేతులమీదుగా

# ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ కు సన్మానం.

### -ఎమ్మెల్యే అఖిలప్రియ సారధ్యంలో అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి చెందుతున్నారు.

### -శిరివెళ్ళ మర్కస్ మసీద్ కమిటీ అధ్యక్షులు ,అడ్వకేట్ పి.ఎం.డి. ఉస్మాన్ భాష.

### - ప్రతి ఒక్కరి బాధ్యతతోనే సమాజాభివృద్ధి సాధ్యం. -%ఆళ్ళగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ.

**ఆంధ్ర ప్రగతి శిరివెళ్ళ సెప్టెంబర్ 13:**
మండల కేంద్రంలోని మర్కస్ మసీద్ కమిటీ సభ్యులు ఆళ్లగడ్డలోని స్థానిక టిడిపి కార్యాలయాన్ని సందర్శించి ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ , టీడీపీ నాయకులు భార్గవ్ రామ్, భూమా జగత్ విఖ్యాత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా మర్కస్ మజీద్ కమిటీ అధ్యక్షుడు, అడ్వకేట్ పి.ఎం.డి. ఉస్మాన్ భాష ప్రమాణ స్వీకారం చేసుకున్న సందర్భంగా, ఆయా నేతలను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు.

అనంతరం బోకేలను అందజేస్తూ, తమ ఆప్యాయతను వ్యక్తం చేశారు.ముస్లిం సమాజం అభివృద్ధి, సామాజిక ఐక్యత, మత సామరస్యాన్ని కాపాడడంలో ఎమ్మెల్యే అఖిలప్రియ చేస్తున్న కృషిని కమిటీ అధ్యక్షుడు , అడ్వకేట్ పి.ఎం.డి. ఉస్మాన్ భాష ప్రత్యేకంగా ప్రశంసించారు. ఆమె నాయకత్వంలో ఆళ్లగడ్డ నియోజకవర్గం లోని అన్ని వర్గాల ప్రజలు సమానంగా అభివృద్ధి చెందుతున్నారని భావిస్తూ, భవిష్యత్తులో మరింత సహకారం అందించాలని కోరారు.ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు, అడ్వకేట్ పి.ఎం.డి. ఉస్మాన్ భాష మాట్లాడుతూ... "ప్రాంత ప్రజల





అభ్యున్నతికి ఎల్లప్పుడూ పక్షపాత రహితంగా సేవలు అందించే నాయకురాలు మన ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అని తెలిపారు. ఆమె సానుకూల ధోరణి కారణంగానే నేడు అన్ని వర్గాలకు సమాన ప్రాధాన్యం లభిస్తోందన్నారు. భవిష్యత్తులో కూడా ఈ ఆప్యాయత కొనసాగాలని కోరుకుంటున్నాము" అని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అఖిలప్రియ మాట్లాడుతూ...

"సమాజ అభివృద్ధి అనేది ప్రతి ఒక్కరి భాగస్వామ్యంతోనే సాధ్యమవుతుందని, ముస్లిం సమాజం చూపిస్తున్న మద్దతు నాకు మరింత బాధ్యత కలిగిస్తుందని అన్నారు.
విద్య, ఉపాధి, సంక్షేమ పథకాల ద్వారా అందరికీ సమాన అవకాశాలు అందించే దిశగా కృషి చేస్తానని" హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ శ్రీకాంత్ రెడ్డి, మర్కస్ మసీద్ అధ్యక్షులు, కమిటీ సభ్యులు నంద్యాల అబూబకార్ సిద్ధిక్, జిక్రియా బ్రదర్స్, అల్లా బకాస్, వషీం, మునాప్ (ఉపాధ్యాయుడు), ఫరూక్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.టిడిపి నాయకులు కూడా పెద్ద సంఖ్యలో హాజరై సన్మాన కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# నిబంధనలు బ్రేక్ చేసిన ఫోన్‌పే.. భారీ జరిమానా విధించిన ఆర్బీఐ

**సెప్టెంబర్ 13 (గుడివాడ మెయిల్):**
యూపీఐ చెల్లింపుల రంగంలో అగ్రగామిగా కొనసాగుతూ, త్వరలో ఐపీఓకు రాబోతున్న ఫోన్‌పే సంస్థకు అనూహ్య పరిణామం ఎదురైంది. నిబంధనల ఉల్లంఘన కారణంగా భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) ఈ సంస్థకు రూ. 21 లక్షల జరిమానా విధించింది. ప్రీపెయిడ్ పేమెంట్ సాధనాలకు (పీపీఐ) సంబంధించిన నిబంధనలను ఫోన్‌పే పాటించలేదని ఆర్బీఐ స్పష్టం చేసింది. ఎందుకీ జరిమానా?ముఖ్యంగా కంపెనీకి చెందిన ఎస్క్రో ఖాతాలో ఉండాల్సిన రోజువారీ నిల్వ, కస్టమర్లు, వ్యాపారులకు చెల్లించాల్సిన మొత్తం కంటే తక్కువగా ఉన్నట్లు ఆర్బీఐ తన తనిఖీల్లో గుర్తించింది. అంతేకాకుండా ఈ నిధుల కొరత విషయాన్ని తమ దృష్టికి తీసుకురావడంలో కూడా ఫోన్‌పే విఫలమైందని కేంద్ర బ్యాంకు పేర్కొంది. ఈ ఉల్లంఘనల నేపథ్యంలోనే పేమెంట్ అండ్ సెటిల్‌మెంట్స్ చట్టం-2007 కింద ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపింది.2023 అక్టోబర్ నుంచి 2024 డిసెంబర్ మధ్య కాలంలో ఫోన్‌పే కార్యకలాపాలపై విస్తృత స్థాయిలో తనిఖీలు నిర్వహించినట్లు ఆర్బీఐ తెలిపింది. నిబంధనల ఉల్లంఘనలపై ఎందుకు జరిమానా విధించకూడదో చెప్పాలంటూ కంపెనీకి నోటీసులు జారీ చేసింది. ఫోన్‌పే ఇచ్చిన సమాధానం, విచారణలో వారి వాదనలు విన్న తర్వాత ఈ నెల 10న ఈ జరిమానా విధిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది.

# వచ్చే జూన్‌లో ఎగరనున్న విమానాలు

### తుదిదశకు భోగాపురం ఎయిర్‌పోర్ట్ పనులు -పనులను పరిశీలించిన మంత్రి రామ్మోహన్ నాయుడు

విజయనగరం **సెప్టెంబర్ 13ఆంధ్ర ప్రగతి** భోగాపురం ఎయిర్‌పోర్టు నుంచి విమాన సర్వీసులు 2026 జూన్‌లో ప్రారంభమవుతాయని పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు అన్నారు. ఇప్పటికే శరవేగంగా పనులు పూర్తవుతున్నాయని అన్నారు. విమానాశ్రయ నిర్మాణ పనులను శనివారం ఆయన పరిశీలించారు. పనుల పురోగతి, పూర్తికావాల్సిన నిర్మాణాలు, తదితర అంశాలపై నిర్మాణ సంస్థ అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఎన్ని సవాళ్లు ఎదురైనా జీఎంఆర్ సంస్థ పనులు ఆపడం లేదన్నారు. ఓ వైపు వర్షాలు కురుస్తున్నా ఎయిర్‌పోర్టు నిర్మాణ పనులు మాత్రం కొనసాగుతున్నాయని చెప్పారు. ఇప్పటి వరకు 86 శాతం ఎయిర్‌పోర్టు నిర్మాణం పూర్తయిందని చెప్పారు. విశాఖ నుంచి రోడ్డు కనెక్టివిటీ-కి సంబంధించి అనేక సార్లు సమీక్షలు నిర్వహించామన్నారు. మొత్తం 7 పాయింట్లు- గుర్తించామని చెప్పారు. మార్చి, ఏప్రిల్‌లోగా ఈ రహదారి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఎలివేటెడ్ కారిడార్ కూడా ప్రతిపాదనలో ఉంది. బీచ్ కారిడార్ నిర్మాణం కోసం కూడా డీపీఆర్ సిద్ధం చేస్తున్నాం. విశాఖ నుంచి కొచ్చికి కనెక్టివిటీ- కోసం వినతులు వచ్చాయి. విశాఖ నుంచి అంతర్జాతీయ కనెక్టివిటీ- పెంచేందుకు దృష్టి సారించామని రామ్మోహన్ నాయుడు తెలిపారు.



రన్ వే, ఎర్త్ వర్క్, ట్యాక్సీ స్టాండ్ 100 శాతం పనులు అయ్యాయని.. -టె-ర్మినల్ 79, ఏటిసి 90, బిల్డింగ్స్ 62, కనెక్టింగ్ రోడ్లు 68 శాతం పూర్తయిందని వెల్లడించారు. 2026 జూన్ లో ఎయిర్ పోర్ట్ కార్యకలాపాలు ప్రారంభిస్తామని శుభవార్త చెప్పారు. విశాఖ నుంచి ఎయిర్ పోర్ట్ రాకపోకల కోసం సులభతరమైన రవాణా సౌకర్యం కల్పిస్తామని స్పష్టం చేశారు. ఏప్రిల్ 2026 లోపు ఏడు రహదారులను పూర్తి చేస్తామని వివరించారు. ఎయిర్ పోర్ట్ అనుసంధానంగా బీచ్ కారిడార్ పనులు త్వరలో ప్రారంభిస్తామన్నారు. గత ప్రభుత్వంలో వ్యక్తిగత ప్రయోజనాల కోసం బీచ్ కారిడార్ ఎలైన్మెంట్ మార్చారన్నారు. పెట్టు-బడిదారులను భయపెట్టి అభివృద్ధిని అడ్డుకుంది వైసీపీ అని విమర్శించారు.. ప్రభుత్వం అభివృద్ధి కోసం ప్రయత్నిస్తుంటే వైసీపీ అడుగడుగునా అడ్డు పడుతుందని ఆరోపించారు.




నిర్మాణం పూర్తికాని మెడికల్ కాలేజీల కోసం మాత్రమే పీపీపీ మోడ్ లో చేయడానికి ప్రయత్నిస్తున్నామని.. కానీ వైసీపీ రౌడీయిజం చేస్తుందన్నారు.
రెండు దశల్లో భోగాపురం విమానాశ్రయం నిర్మాణాన్ని పూర్తి చేయనున్నారు. రూ.4,592 కోట్ల వ్యయంతో తొలు దశలో 22 ఏరో బ్రిడ్జిలు, 81,000 చదరపు మీటర్ల టెర్మినల్ బిల్డింగ్ నిర్మించనున్నారు. 2,203 ఎకరాల్లో విమానాశ్రయం విస్తీర్ణం పూర్తి చేయనున్నారు. ఇతర అవసరాలకు ఇటీవల మరో 500 ఎకరాలను ప్రభుత్వం కేటాయించింది. ఒక్కోటీ- 3.8 కి.మీ. పొడవుతో రెండు రన్‌వేలు నిర్మిస్తున్నారు. ఏటా ప్రయాణికులు ఆరంభంలో 60 లక్షలమంది ఉండగా, అంచెలంచెలుగా ఈ సంఖ్య నాలుగు కోట్లకు చేరుకుంటుందని భావిస్తున్నారు. 2030 ప్రారంభంలో రెండోదశ నిర్మాణ పనులు మొదలు కానున్నాయి.

# సమిష్టి కృషితో జిల్లాను అభివృద్ధి చేద్దాం

### జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి

**కర్నూలు సెప్టెంబర్ 13ఆంధ్ర ప్రగతి**
సమిష్టి కృషితో జిల్లాను అభివృద్ధి చేద్దాం అని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి జిల్లా అధికారులతో పేర్కొన్నారు.. శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు..
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కర్నూలు కలెక్టర్ గా ఫస్ట్ పోస్టింగ్ అని తెలిపారు. జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించేందుకు అధికారులందరూ సహకరించాలని కలెక్టర్ కోరారు...కలెక్టర్ లుగా నియమితులైన వారందరితో ముఖ్యమంత్రి మాట్లాడారని, జిల్లాలను అభివృద్ధిలో అగ్రగామిగా తీర్చి దిద్దాలని ఆదేశించారన్నారు. ఆ మేరకు ప్రభుత్వ ప్రాధాన్యతలపై ప్రత్యేక దృష్టి సారించి, అధికారులు పనిచేయాలని సూచించారు.. ప్రజలకు మేలు జరిగే విధంగా, సంక్షేమాన్ని అందించే విధంగా,అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించే విధంగా



చర్యలు తీసుకోవాలన్నారు. కోర్టు కేసులు, ఆర్టీఐ అంశాల్లో అలసత్వం వహించకుండా వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు..పనుల్లో వేగం ముఖ్యం అని కలెక్టర్ స్పష్టం చేశారు. వివిధ శాఖల మధ్య సమన్వయం అవసరం అని, ప్రజల సంక్షేమం కోసం సమష్టిగా పని చేద్దామన్నారు. సానుకూల దృక్పథంతో, సంతోషకర వాతావరణంలో, స్మార్ట్ గా పని చేద్దామని



కలెక్టర్ అధికారులకు సూచించారు.
అనంతరం జిల్లా అధికారులు పరిచయం చేసుకుని, పుష్పగుచ్ఛాలు అందించి కలెక్టర్ కు అభినందనలు తెలిపారు.సమావేశంలో జాయింట్ కలెక్టర్ డా. బి.నవ్య, డి ఆర్ ఓ సి. వెంకట నారాయణమ్మ, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు..

# సమాజానికి మంచి చేసే వార్తలను అందించాలి

**రాష్ట్ర పరిశ్రమలు వాణిజ్యం ఫుడ్ ప్రాసెసింగ్ శాఖా మంత్రి టి.జి.భరత్**

**మంచిని గుర్తించి చెడు జర్నలిజం కు స్వస్తి పలకాలి -ఆంధ్రప్రదేశ్ సి ఆర్ మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్**







**కర్నూలు సెప్టెంబర్ 13ఆంధ్ర ప్రగతి**
సమాజానికి మంచి చేసే వార్తలను అందించాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం ఫుడ్ ప్రాసెసింగ్ శాఖా మంత్రి టి.జి. భరత్ పేర్కొన్నారు.
శనివారం మౌర్య హోటల్ లోని పరిణయ సమావేశ మందిరంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సి ఆర్ ప్రెస్ అకాడమీ మరియు ఏపీడబ్ల్యూజే సంయుక్తంగా కర్నూలు జిల్లా విలేకరుల పునఃశ్చరణ తరగతులు నిర్వహించిన సందర్భంగా ప్రారంభ సమావేశం లో మంత్రి టి.జి. భరత్ పాల్గొన్నారు..ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రస్తుతం ఏ ఐ వంటి సాంకేతికత పరిజ్ఞానం అందుబాటు లోకి వచ్చిందని, దీనిని జర్నలిజం రంగంలో వినియోగించుకొని సమాజాభివృద్ధికి తోడ్పడేలా సమాచారాన్ని అందించాలని కోరారు. విలేకరులకు పునశ్చరణ తరగతులు నిర్వహించడం చాలా మంచి విషయం అని, యువ జర్నలిస్టులకు అనుభవం కలిగిన జర్నలిస్టులచే జర్నలిజం తరగతులు నిర్వహించడం వల్ల వృత్తిలో మెరుగుదల సాధించగలుతారని తెలిపారు..ప్రస్తుత కాలంలో సోషల్ మీడియా లో ఇబ్బడి ముబ్బడిగా సమాచారం ఉంటోందని, అందులో కొంత అవాస్తవాలు కూడా ఉంటాయన్నారు.. ఈ నేపథ్యంలో ప్రజలకు మంచి సమాచారాన్ని అందించాలని మంత్రి సూచించారు. ఆంధ్ర ప్రదేశ్ సిఆర్ మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్ మాట్లాడుతూ... 1996లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో మీడియా అకాడమీ ని అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గారు జర్నలిజంలో నాణ్యతను పెంచడానికి ఏర్పాటు చేశారని తెలిపారు. 2014 లో రాష్ట్రం రెండు గా విడిపోయిన తర్వాత రెండు రాష్ట్రాలకు మీడియా అకాడమీ లు ఏర్పడ్డాయని, విశాలాంధ్ర పత్రిక లో దాదాపు 30 సంవత్సరాలు పైగా జర్నలిస్ట్ గా పనిచేసి స్వర్గస్తులైన చక్రవర్తుల రాఘవాచారి పేరుతో సి ఆర్ మీడియా అకాడమీ గా పేరు మార్పు చేసి జర్నలిస్టులకు మెలకువలు అందించడం జరుగుతోందన్నారు. మనిషి ఎప్పటికీ నిత్య విద్యార్థి అని, ఎప్పటికప్పుడు వృత్తి నైపుణ్యాలు పెంచుకోవాల్సిన అవసరం చాలా ఉందన్నారు. ఇంటర్నెట్ వచ్చిన తర్వాత సోషల్ మీడియా విస్తృతంగా అభివృద్ధి చెందిందని, తద్వారా ప్రజలందరూ జర్నలిస్టులుగా సమాచారాన్ని అందిస్తున్నారన్నారు. ఇందులో మంచి , చెడు రెండూ ఉన్నాయని తెలిపారు. సమాజంలో జరుగుతున్న మంచిని ప్రజలకు తెలియజేయడంతో పాటు చెడును సరిదిద్దే దిశగా వార్తలను రాయడం జర్నలిస్టుల కర్తవ్యమని స్పష్టం చేశారు. ఈ పునశ్చరణ తరగతులు జర్నలిస్టుల నైపుణ్యాలు పెంచడానికి, సమాజంలో పాజిటివ్ జర్నలిజం బలోపేతానికి ఉపయోగపడతాయని ఓ ఆంధ్రప్రదేశ్ సి ఆర్ మీడియా అకాడమీ చైర్మన్ తెలియజేశారు.
షేక్ కరీముల్లా బృందం చిన్నారులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు.
అనంతరం డెస్క్ కో ఆర్డినేషన్ అంశంపై కర్నూలు ఆంధ్ర జ్యోతి ఎడిషన్ ఇంచార్జి నవీన్ నాయుడు , ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అంశంపై సీనియర్ జర్నలిస్ట్, ఏఐ ట్రైనర్ విజయ్ కుమార్ శిక్షణ ఇచ్చారు.సమావేశంలో సిఆర్ మీడియా అకాడమీ సెక్రటరీ మణిరామ్,ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు ఐవీ సుబ్బారావు, ఉపాధ్యక్షులు కొండప్ప, జాతీయ సభ్యులు వెంకటసుబ్బయ్య,నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికలే లక్ష్యంగా విజయ్ పొలిటికల్ టూర్..

# తిరుచ్చి నుంచి తొలి ప్రచార యాత్ర


**సెప్టెంబర్ 13ఆంధ్ర ప్రగతి**
తమిళనాడు రాజకీయాల్లో నటుడు విజయ్ తనదైన ముద్ర వేసేందుకు సిద్ధమయ్యారు. 2026 అసెంబ్లీ ఎన్నికలను లక్ష్యంగా చేసుకుని, ఆయన స్థాపించిన 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) పార్టీ తొలి ప్రచార యాత్రను నేడు ప్రారంభించారు. ఈ యాత్ర కోసం ద్రవిడ రాజకీయాల్లో చారిత్రక ప్రాధాన్యమున్న తిరుచ్చి నగరాన్ని వేదికగా ఎంచుకోవడం ఇప్పుడు సర్వత్ర ఆసక్తి రేపుతోంది.
తిరుచ్చి నుంచి ప్రత్యేక ప్రచార వాహనంలో బయలుదేరిన విజయ్ అరియలూరులో జరగనున్న భారీ బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఈ పర్యటన కోసం అత్యాధునిక కెమెరాలు, లౌడ్ స్పీకర్లతో పాటు ఎవరూ బస్సుపైకి ఎక్కకుండా ఇనుప రెయిలింగ్‌లతో కూడిన ప్రత్యేక వాహనాన్ని సిద్ధం చేశారు. 'మీ విజయ్, నేను విఫలం కాను', 'తమిళనాడు, విజయ్ వారసత్వం తిరిగొస్తుంది' వంటి నినాదాలతో కూడిన పార్టీ ప్రచార లోగోను కూడా ఆవిష్కరించారు.
విజయ్ యాత్రకు పోలీసులు 25 కఠిన నిబంధనలతో కూడిన షరతులతో పోలీసులు అనుమతులు మంజూరు చేశారు. రోడ్‌షోలు, సన్మానాలు, భారీ వాహన కాన్వాయ్‌లపై ఆంక్షలు విధించారు. విజయ్ ప్రచార బస్సును కేవలం ఐదు వాహనాలు మాత్రమే అనుసరించాలని, పార్టీ కార్యకర్తలు ఉదయం 11:25 గంటల కల్లా అరియలూరు పాత బస్టాండ్ వద్దకు చేరుకోవాలని ఆదేశించారు. ప్రజల భద్రత కోసం పార్టీయే బారికేడ్లు ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు.



నిబంధనలు ఉల్లంఘిస్తే యాత్రను నిలిపివేసే అధికారం తమకు ఉంటుందని పోలీసులు హెచ్చరించారు.
ద్రవిడ రాజకీయాల్లో కీలక నిర్ణయాలకు తిరుచ్చి చారిత్రకంగా ఓ వేదికగా నిలిచింది. గతంలో ఏఐఏడీఎంకే అధినేత, మాజీ ముఖ్యమంత్రి ఎంజీ రామచంద్రన్ (ఎంజీఆర్) తన చారిత్రాత్మక మధ్యాహ్న భోజన పథకాన్ని ఇక్కడి నుంచే ప్రారంభించారు. అంతేకాకుండా, తిరుచ్చిని తమిళనాడుకు రెండో రాజధానిగా ప్రకటించారు. అలాగే, డీఎంకే వ్యవస్థాపకుడు సీఎన్ అన్నాదురై కూడా తన పార్టీ ఎన్నికల్లో పోటీ చేయాలా, వద్దా అనే కీలక నిర్ణయాన్ని తిరుచ్చిలోనే తీసుకున్నారు. ఇప్పుడు అదే బాటలో విజయ్ కూడా తన రాజకీయ ప్రస్థానాన్ని ఇక్కడి నుంచే ప్రారంభించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇటీవల ఏఐఏడీఎంకే ప్రధాన కార్యదర్శి పళనిస్వామి కూడా ఇదే ప్రాంతంలో ప్రచారం నిర్వహించారు. ఇప్పుడు విజయ్ అడుగుపెట్టడంతో ఈ యాత్ర తమిళనాడు రాజకీయాల్లో ఒక కీలక మలుపు అవుతుందని ఆయన మద్దతుదారులు భావిస్తున్నారు. ఈ ప్రారంభపు ఉత్సాహం రానున్న ఎన్నికల్లో రాజకీయంగా ఎంతవరకు ఫలిస్తుందో వేచి చూడాలి.

# విజయవాడలో విషాదం

**: కొడుకు ప్రేమ వ్యవహారం.. హిజ్రాల దాడితో తల్లి ఆత్మహత్య**



విజయవాడ **సెప్టెంబర్ 13ఆంధ్ర ప్రగతి**
విజయవాడలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. కొడుకు ప్రేమ వ్యవహారం కారణంగా కొందరు హిజ్రాలు దాడి చేశారన్న మనస్తాపంతో ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, గిరిపురం ప్రాంతానికి చెందిన గోపీచంద్, అదే ప్రాంతానికి చెందిన మంజుల అనే యువతి గత మూడేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. వీరి ప్రేమను వ్యతిరేకిస్తూ మంజుల తరఫున సుమారు 20 మంది హిజ్రాలు ఈ నెల 11వ తేదీన గోపీచంద్ ఇంటిపై దాడికి దిగారు. ఈ దాడిలో గోపీచంద్‌తో పాటు అతని తండ్రి కుమార్‌బాబు, తల్లి కుమారి (40)పై విచక్షణారహితంగా దాడి చేశారు.ఈ అనూహ్య పరిణామంతో, బహిరంగంగా జరిగిన దాడితో తీవ్ర ఆవేదనకు గురైన కుమారి, ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను వెంటనే విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ రెండు రోజులుగా చికిత్స పొందుతూ శనివారం ఉదయం ఆమె కన్నుమూశారు.కుమారి మరణవార్త తెలియగానే బంధువులు ఆగ్రహంతో మాచవరం పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకుని ఆందోళన చేపట్టారు. దాడికి పాల్పడిన హిజ్రాలను తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. దాడిలో పాల్గొన్న హిజ్రాలను గుర్తించి, వారిని అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నామని అధికారులు వెల్లడించారు.

# అమరావతిపై వైసీపీ కొత్త నాటకం

**: మంత్రి అనగాని సత్యప్రసాద్ ఫైర్**

**సెప్టెంబర్ 13ఆంధ్ర ప్రగతి**
రాష్ట్ర రాజధాని అమరావతి విషయంలో వైసీపీ నేతలు మరోసారి కొత్త నాటకాలకు తెరలేపుతున్నారని రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. గతంలో రాజధానిపై 'మూడు ముక్కలాట' ఆడిన మాజీ ముఖ్యమంత్రి జగన్ ను ప్రజలు ఇప్పటికే తిరస్కరించారని ఆయన గుర్తుచేశారు. అయినా వైసీపీ నేతలు తమ వైఖరి మార్చుకోకుండా ప్రజలను గందరగోళపరిచే ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు.ఒకవైపు అమరావతి రాజధానిగా వద్దని చెబుతూనే, మరోవైపు గుంటూరు, విజయవాడ మధ్య రాజధాని నిర్మిస్తామని వైసీపీ నేతలు విరుద్ధమైన ప్రకటనలు చేస్తున్నారని అనగాని దుయ్యబట్టారు. ఈ అంశంలో జగన్ వైఖరి 'గోడ మీద పిల్లి' చందంగా ఉందని, ప్రజలు ఈ విషయాన్ని నిశితంగా గమనిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.
గత ఐదేళ్ల పాలనలో అమరావతి రైతులు, మహిళలపై జగన్ ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులు, వారిని పెట్టిన ఇబ్బందులను ప్రజలు ఇంకా మర్చిపోలేదని మంత్రి అన్నారు. రాజధాని కోసం భూములిచ్చిన రైతులను వేధించిన తీరును ఎవరూ క్షమించరని తెలిపారు. అమరావతిని పూర్తిగా నిర్లక్ష్యం చేసి, రాష్ట్రాభివృద్ధిని కుంటుపరిచిన జగన్‌కు ప్రజలు తగిన బుద్ధి చెప్పారని, వచ్చే ఎన్నికల్లోనూ ఆయనకు ఓటమి తప్పదని అనగాని సత్యప్రసాద్ జోస్యం చెప్పారు.

# తెలంగాణ ఆకాంక్షను చాటిన సకలజనుల సమ్మె

**ఆనాటి ఘట్టానికి 14 ఏల్లు పూర్తి...కెటిఆర్ ట్వీట్**



హైదరాబాద్, **సెప్టెంబర్ 13ఆంధ్ర ప్రగతి** :తెలంగాణ ప్రజల్లో స్వరాష్ట్ర ఆకాంక్ష ఎంత బలంగా ఉందో చాటి చెప్పిన మహోధృత ఉద్యమ రూపం సకల జనుల సమ్మె అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఉద్యమ సారథి కేసీఆర్ పిలుపుతో యావత్ తెలంగాణ సమాజం ఒక్కటైందని చెప్పారు. సబ్బండ వర్గాలు ఏకమై 42 రోజులపాటు– శాంతియుతంగా నిరసన తెలిపి, తెలంగాణ సెగను ఢిల్లీకి తాకేలా చేశారన్నారు. ఔర్ ఏక్ ధక్కా..తెలంగాణ పక్కా అని దిక్కులు పిక్కటిల్లేలా తెలంగాణ ప్రజలు నినదించారని గుర్తుచేశారు. సకల జనుల సమ్మెకు శనివారంతో 14 ఏండ్లు పూర్తయిన సందర్భంగా.. సమ్మెలో పాల్గొన్న ప్రతీ ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ ప్రజల్లో స్వరాష్ట్ర ఆకాంక్ష ఎంత బలంగా ఉందో చాటి చెప్పిన మహోధృత ఉద్యమ రూపం సకల జనుల సమ్మె. సబ్బండ వర్గాల ప్రజలు ఏకమై, 42 రోజుల పాటు– శాంతియుతంగా నిరసన తెలిపి, తెలంగాణ సెగను ఢిల్లీకి తాకేలా చేసిన మహోన్నత ఘట్టం సకల జనుల సమ్మె. సెప్టెంబర్ 12, 2011 రోజున కరీంనగర్ జనగర్జనలో ఉద్యమ సారథి కేసీఆర్ పిలుపు మేరకు యావత్ తెలంగాణ సమాజం ఒక్కటయ్యింది. సమ్మెలో స్వచ్ఛంధంగా భాగస్వాములయ్యి, ఔర్ ఏక్ ధక్కా.. తెలంగాణ పక్కా అని దిక్కులు పిక్కటిల్లేలా తెలంగాణ ప్రజలు నినదించారు. నిర్బంధాలను ఛేదించి, ఆంక్షలకు ఎదురొడ్డి, బెదిరింపులను లెక్కచేయకుండా తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా
తెలంగాణ బిడ్డలు పోరాడారు. సకల జనుల సమ్మెకు నేటితో 14 ఏళ్ళు నిండిన సందర్భంగా.. సమ్మెలో పాల్గొన్న ప్రతీ ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు. అని కేటీఆర్ ట్వీట్ చేశారు.
------

# కింది రాష్ట్రాలకే మిగులు జలాల హక్కు

**విశ్రాంత ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు**



గుంటూరు **సెప్టెంబర్ 13ఆంధ్ర ప్రగతి** మిగులు జలాలలను కింది రాష్ట్రాలు ఉపయోగించుకునే హక్కు ఉందని విశ్రాంత ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు అన్నారు. గోదావరి మిగులు జలాలను ఉపయోగించుకునే హక్కు ముమ్మాటికీ ఎపికి ఉందన్నారు. ఉమ్మడి ఏపీలో కోస్తాంధ్ర నిర్లక్ష్యానికి గురైందని ఆయన అన్నారు. గుంటూరు బాలానంద కేంద్రంలో ఆలోచనపరుల వేదిక ఆధ్వర్యంలో 'నదీ జలాల హక్కుల పరిరక్షణ, నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణం'పై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. ఉమ్మడి ఏపీలో హైదరాబాద్ కేంద్రీకృతంగా అభివృద్ధి కోసం నిధులు ఖర్చు చేశారన్నారు. గత 40 ఏళ్లలో ఒక్క భారీ సాగునీటి ప్రాజెక్టు కూడా కోస్తాంధ్రకు రాలేదని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం దశాబ్దాలుగా జరుగుతూనే ఉందని పేర్కొన్నారు. ప్రాజెక్టు డిజైన్లు, నిర్మాణం అంతా రైతుల అవసరాల కోసమే జరగాలని చెప్పారు. మిగులు జలాలు వాడుకునే హక్కు చివరి రాష్ట్రం ఏపీకి ఉంది. ఒక బేసిన్‌నుంచి మరో బేసిన్‌కు నీరు తరలించుకోవచ్చు.ఈ విషయాలు బచావత్ ట్రిబ్యునల్ గతంలో స్పష్టం చేసింది. కానీ తెలంగాణ అనవసర రాద్ధాంతం చేసి మిగులు జలాలపై అసత్య ప్రచారం చేస్తోంది. దీన్ని సాకుగా చూపి తెలంగాణ అనుమతులు లేని ప్రాజెక్టులు నిర్మిస్తోందని ఏబీ వెంకటేశ్వరరావు అన్నారు. కింద సముద్రంలోకి పోతున్న జలాలపై పేచీ పెట్టడం సరికాదన్నారు. బనకచర్ల పేరుతో ఇటీవల చంద్రబాబునాయుడు కొత్త ప్రతిపాదన తేగా తెలంగాణ అభ్యంతరం వ్యక్తం చేసింది. దీంతో ఇప్పుడు దీనిని బలంగా ముందుకు తీసుకుని వెళ్లే క్రమంలో ఈ ప్రతిపాదనలపై వివిధ వేదికల ద్వారా ప్రచారం చేయిస్తున్నట్లు అర్థం అవుతోంది.

# ప్రజలను ఎల్లకాలం మోసం చేయలేం

**జగన్‌కు దమ్ముంటే మెడికల్ టెండర్లలో పాల్గొనాలి**

**కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సవాల్**



గుంటూరు **సెప్టెంబర్ 13ఆంధ్ర ప్రగతి** పజలను జగన్ ఎప్పుడో ఒకసారి మోసం చేయొచ్చు.. కానీ ప్రతిసారి మోసం చేయలేరని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ విమర్శించారు. గుంటూరు, రాజధాని ప్రజలు బాగా తెలివిగల వారని పెమ్మసాని చంద్రశేఖర్ ప్రశంసించారు. ఐదేళ్ల పాలనో ప్రజలనో మభ్య పెట్టారని, రాష్ట్రాన్ని దోచుకున్నారని అన్నారు. ఇంతకన్నా దారుణం ఉంటుందా అని వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సవాల్ విసిరారు. జగన్‌కు చేతనైతే మెడికల్ కళాశాలల్లో టెండర్లు పాడుకొని.. అభివృద్ధి చేయాలని ఛాలెంజ్ విసిరారు. శనివారం గుంటూరులోని ప్రభుత్వ మహిళా కళాశాలను పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే నజీర్ పరిశీలించారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడారు. ఎవరికీ అధికారం ఇవ్వాలో ప్రజలకు బాగా తెలుసునని చెప్పుకొచ్చారు. వైసీపీ హయాంలో ఎయిమ్స్‌కు నీళ్లు, రోడ్లు ఇవ్వలేదని ధ్వజమెత్తారు. ప్రభుత్వ మహిళా కళాశాలను కూడా కాపాడలేని అసమర్థత జగన్ ప్రభుత్వానిదని విమర్శించారు. జగన్ ఇష్టానుసారంగా మాట్లాడటం చూస్తే నవ్వు వస్తోందని ఎద్దేవా చేశారు. టీ–డీపీ హయాంలోనే మెడికల్ కళాశాలకు అనుమతి తీసుకున్నామని గుర్తుచేశారు. కానీ ఇప్పుడు జగన్ ఏదో తానే కష్టపడి తెచ్చినట్లు– మాట్లాడటం చూస్తుంటే విడ్డూరంగా ఉందని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సె–టైర్లు గుప్పించారు.

# మావోయిస్టు అగ్రనేత సుజాతక్క లొంగుబాటు

**ధృవీకరించిన డిజిపి జితేందర్**

హైదరాబాద్, **సెప్టెంబర్ 13:**మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యురాలు పోతుల కల్పన ఎలియాస్ సుజాతక్క తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయారు. గద్వాల ప్రాంతానికి చెందిన ఆమె ప్రస్తుతం మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీలో ఉన్న ఏకైక మహిళా నాయకురాలు. పశ్చిమబెంగాల్‌లో 2011 జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మావోయిస్టు పార్టీ అగ్రనేత కిషన్‌జీ భార్య ఆమె. ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్ సౌత్ సబ్ జోనల్ బ్యూరో ఇన్‌ఛార్జిగా ఉన్నట్లు– సమాచారం. సుజాతక్క 106 కేసుల్లో నిందితురాలిగా ఉన్నారు. ఆమెతో పాటు మరికొందరు మావోయిస్టులు లొంగిపోయినట్లు తెలుస్తోంది. సుజాతక్కపై రూ.కోటి రివార్డు ఉంది. సుజాతక్క లొంగుబాటు వివరాలను డీజీపీ జితేందర్ వెల్లడించారు. ఆమె స్వస్థలం గద్వాల జిల్లా గట్టు– మండలం పెంచికలపాడు. ఆమె మొదట్లో ఆర్ఎస్‌యూ, జన నాట్యమండలిలో పని చేశారు. 1996లో కమాండర్‌గా విధులు నిర్వహించారు. 2001లో రాష్ట్ర కమిటీ– సభ్యురాలిగా పనిచేశారు. అనారోగ్య కారణాలతో సుజాతక్క బయటికి వచ్చారు. ఆమెకు రూ.25 లక్షల రివార్డు అందిస్తాం. మావోయిస్టులు జనజీవన స్రవంతిలోకి రావాలని ఆహ్వానిస్తున్నాం. మావోయిస్టులు చాలా మంది లొంగిపోతున్నారని జితేందర్ తెలిపారు.

# ఎస్డిఆర్ ఆకాంక్ష కళాశాల నీట్ .ఐఐటి విద్యార్థులకు అభినందనలు తెలిపిన చైర్మన్ కొండారెడ్డి.

## నీట్,ఐఐటీలో ప్రభంజనం ఎన్టీఆర్ ఆకాంక్ష కళాశాల విద్యార్థులు.

మెడిసిన్ ట్రిబుల్ ఐటీ ఎన్ఐటిలో సీట్లు సాధించిన ఎస్ డి ఆర్ ఆకాంక్ష జూనియర్ విద్యార్థులను అభినందించిన చైర్మన్ కొండారెడ్డి.
















**ఆంధ్ర ప్రగతి నంద్యాల సెప్టెంబర్ 13:**

నంద్యాల పట్టణ శివారులోని ఎస్ డి ఆర్ ఆకాంక్ష జూనియర్ కళాశాల నందు శనివారం నాడు మెడికల్ మరియు ఐఐటి, ఎన్ ఐఐ ర్యాంకర్స్ అభినందన సభ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్ టి ఆర్ ఆకాంక్ష జూనియర్ కళాశాల చైర్మన్ శ్రీ కొండారెడ్డి హాజరై విద్యార్థిని విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా చైర్మన్ కొండారెడ్డి మాట్లాడుతూ..మేనేజ్మెంట్ అందించిన ప్రోత్సాహం ఉత్తమమైన వాతావరణం వల్ల విద్యార్థులు దేశంలోని ప్రముఖ విద్యాసంస్థల్లో సీట్లు సాధించారన్నారు. అదేవిధంగా విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ మా పిల్లలు ఎంతటి అద్భుతమైన ఫలితాలు సాధించడం చాలా గర్వంగా ఉందని అందుకు కళాశాల అందించిన ప్రోత్సాహమే దీనికి ముఖ్య కారణమని చైర్మన్ కొండారెడ్డికి మరియు అధ్యాపకులకు కృతజ్ఞతలు తెలిపారు. మెడిసిన్ లో సీట్లు సాధించిన విద్యార్థులు భువన తేజ ఏఐఐఎంఎస్ మంగళగిరి, పీవీ జితేంద్ర కెఎంసి కర్నూల్, దీక్షిత రెడ్డి కేఎంసీ కర్నూల్, కే అంజలి జిఎంసి గుంటూరు, మునీ జాహ్నవి ఎస్వీ మెడికల్ కాలేజ్ తిరుపతి, ఎం సుప్రియ జిఎంసి రాజమండ్రి, జీ వై సాయి శృతి జీఎంసీ అనంతపురం, డి రమ్య శ్రీ జిఎంసి అనంతపూర్, ఫసిహ అంజు జి ఎల్ సి రాజమండ్రి, హర్షిని రెడ్డి ఎన్ఎంసి నంద్యాల్, స్పందన ఎన్ఎంసి నంద్యాల, మానస శ్రీ ఏ ఎన్ ఎం సి నంద్యాల, హనుక్ స్వరన్ రాజ్ శాంతిరాం మెడికల్ కాలేజ్ నంద్యాల, రాకేష్ రెడ్డి శాంతిరాం మెడికల్ కాలేజ్ నంద్యాల, సాయి కార్తీక్ రెడ్డి అపోలో మెడికల్ కాలేజ్ చిత్తూర్, తేజేష్ విశ్వభారతి కాలేజ్, కర్నూల్, ప్రముక్త హైదరాబాద్ తదితరులు ఎంబిబిఎస్ నీట్ మెడికల్ లో సీట్లుసీట్లు సాధించారు. అదేవిధంగా ఐఐటి మరియు ఎన్ఐటి లో సీట్లు సాధించిన.. ఎస్ సుజన్ డేటా సైన్స్ మద్రాస్ సిఎస్సి, సుస్మిత ఎన్ఐటి వరంగల్ సివిల్ ఇంజనీరింగ్ కాలేజ్, కాశీ విశ్వనాథ్ రెడ్డి ఎన్ఐటి అస్సాం మెకానికల్ ఇంజనీరింగ్ కాలేజ్, బాలాజీ ఐఐటి భోపాల్, శరత్ ట్రిబుల్ ఐటీ కాంచీపురం మెకానికల్ ఇంజనీరింగ్ కాలేజ్, చరణ్ నాయక్ ట్రిబుల్ ఐటీ కొట్టాయం కేరళ, యశ్వంత్ గతి శక్తి ఇంజనీరింగ్ కాలేజ్ వడదరా మెకానికల్ ఇంజనీరింగ్, చంద్రహాసిని రెడ్డి మణిపాల్ యూనివర్సిటీ తదితరులు సీట్లు సాధించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ శ్రీ కొండారెడ్డి మాట్లాడుతూ.. మెడిసిన్ మరియు ఐఐటి మరియు ఎన్ఐటిలో సీట్లు సాధించిన విద్యార్థులందరికీ అభినందనలు తెలిపారు. విద్యార్థులకు మంచి వాతావరణం, నాణ్యమైన విద్య అందించడమే మా ధ్యేయం అన్నారు. మా ఎస్డిఆర్ ఆకాంక్ష విద్యార్థులు దేశవ్యాప్తంగా ఉన్న ఐఐటి మరియు ఎన్ఐటీల్లో అడుగుపెడుతున్నందుకు ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్తులో మరింత మంది విద్యార్థులు జాతీయస్థాయిలో రాణించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. మా చైర్మన్ సహకారం మేనేజ్మెంట్ ఇచ్చిన ప్రోత్సాహం వల్లనే ఈరోజు మేము ఈ స్థాయిలో సీటు సాధించామని అందుకు కారణమైన ప్రతి ఒక్కరికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఇకపై మా ఊరి పిల్లలు హైదరాబాద్ విజయవాడ వంటి సుదూర ప్రాంతాలకు వెళ్ళవలసిన అవసరం లేదని నంద్యాల పట్టణంలోని ఎన్టీఆర్ ఆకాంక్ష జూనియర్ కళాశాలలోని నాణ్యమైన విద్య బోధన ఉందని తప్పకుండా అక్కడికి వెళ్లి చదువుకోమని అందరికీ చెబుతూ ప్రోత్సహిస్తామని విద్యార్థులు తెలిపారు.

# ఇంగ్లాండ్ ప్రపంచ రికార్డ్ విజయం

**టీ20ఐలో అత్యధిక స్కోరు**

**జింబాబ్వే 290 పరుగుల భారీ తేడాతో విజయం**




సౌతాఫ్రికాతో జరుగుతున్న టీ20 సిరీస్‌లో ఇంగ్లాండ్ క్రికెట్ జట్టు ప్రపంచ రికార్డ్ సృష్టించింది. సిరీస్‌లో భాగంగా రీసెంట్‌గా జరిగిన రెండో టీ20లో సౌతాఫ్రికాను ఇంగ్లాండ్ చిత్తుగా ఓడించింది. ఇంగ్లాండ్ బ్యాటర్ ఫిల్ సాల్ట్ 141 భారీ ఇన్నింగ్స్‌తో చెలరేగడంతో ఆ జట్టు తొలుత 300ం స్కోర్ సాధించింది. అనంతరం అద్భుత బౌలింగ్‌తో ప్రత్యర్థిని 158 పరుగులకే కట్టడి చేసిన ఇంగ్లీష్ జట్టు 146 పరుగుల భారీ తేడాతో నెగ్గింది. దీంతో పలు ప్రపంచ రికార్డులు నమోదు అయ్యాయి.మాంచెస్టర్ వేదికగా శుక్రవారం రెండో టీ20 జరిగింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 304 పరుగులు చేసింది. ఓపెనర్లు ఫిల్ సాల్ట్– జాస్ బట్లర్ ఈ మ్యాచ్‌లో ఆకాశమే హద్దుగా చెలరేగిపోయారు. వీళ్ల దెబ్బకు సౌతాఫ్రికా బౌలింగ్ విభాగం కుదేలైంది. తొలి వికెట్‌కు కేవలం 7.1 ఓవర్లలోనే 126 పరుగులు జోడించారు. బట్లర్ 30 బంతుల్లోనే 83 పరుగులతో రఫ్ఫాడించాడు. అతడు 276.67 స్ట్రైక్ రేట్‌తో ఆడడం విశేషం. ఓపెనర్లిద్దరు ఓ రేంజ్‌లో ప్రత్యర్థి బౌలర్లను ఉతికి ఆరేశారు. అయితే 7.1 ఓవర్ వద్ద ఫార్చ్యూన్ బౌలింగ్‌లో బట్లర్ ఔటయ్యాడు. ఆ తర్వాత సాల్ట్ చెలరేగిపోయాడు. 60 బంతుల్లోనే సాల్ట్ 141పరుగులులి భారీ శతకం సాధించి ఔరా అనిపించాడు. ఇందులో 15 ఫోర్లు, 8 సిక్స్‌లు ఉండడం విశేషం. ఈ ఇద్దరితోపాటు జాకబ్ బెతేల్ (26 పరుగులు), హ్యారీ బ్రూక్ (41లి పరుగులు) చేశారు. దీంతో ఇంగ్లాండ్ టీ20 చరిత్రలో తొలిసారి 300 పరుగుల మార్క్ అందుకుంది. ఈ క్రమంలోనే ఇంటర్నేషనల్ టీ20లో 300ం స్కోర్ నమోదు చేసిన మూడో జట్టుగా ఇంగ్లాండ్ నిలిచింది. ఇంతకుముందు జింబాబ్వే (344/4 పరుగులు %జం% గాంబియా), నేపాల్ (314/3 %జం% మంగోలియా) ఈ ఫీట్ అందుకున్నాయి. అయియి ఐసీసీ ఫుల్ మెంబర్ టీమ్ (అంటే టెస్టు ఆడే దేశాలు)పై బాదిన అరుదైన ఇంగ్లాండ్ సాధించింది.కాగా, అంతర్జాతీయ టీ20ల్లో ఫుల్ మెంబర్ టీమ్‌పై అత్యధిక స్కోర్ చేసిన భారత్ రికార్డును ఇంగ్లాండ్ తాజా మ్యాచ్‌తో బ్రేక్ చేసింది. ఇదివరకు ఈ లిస్ట్‌లో భారత్ ఉండేది. గతేడాది బంగ్లాదేశ్‌పై టీమ్ఇండియా 297 పరుగులు చేసింది. ఇప్పుడు ఇంగ్లాండ్ 304 రన్స్‌తో భారత్ రికార్డ్ బద్దలుకొట్టింది.ఈ మ్యాచ్‌లో ముఖ్యంగా చెప్పుకోవాల్సింది సాల్ట్ బ్యాటింగ్ గురించే. అతడు తొలి ఓవర్ నుంచే రెచ్చిపోయాడు. ఎడాపెడా బౌండరీలు బాదుతూ స్కోర్ బోర్డును జెట్ స్పీడ్‌తో పరిగెత్తించాడు. అతడి దెబ్బకు కగిసో రబాడ (70 పరుగులు), విలియమ్స్ (62 పరుగులు), మార్కో జాన్సన్ (60 పరుగులు) లాంటి స్టార్ బౌలర్లకు సైతం భారీ స్థాయిలో పరుగులు ఇచ్చుకున్నారు. ఈ క్రమంలోనే ఇంగ్లాండ్ తరపున వేగవంతమైన టీ20 సెంచరీ (39 బంతుల్లో) చేసిన రికార్డ్ కొట్టాడు. అలాగే ఆ జట్టు నుంచి టీ20ల్లో అత్యధిక వ్యక్తిగత స్కోర్ సాధించిన బ్యాటర్‌గానూ నిలిచాడు. కాగా, సాల్ట్ 2025 ఐపీఎల్‌లోనూ ఆర్సీబీ తరుపున అద్భుతమైన ఇన్నింగ్స్‌లు ఆడాడు. ఆ జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు.సౌతాఫ్రికాను ఇంగ్లాండ్ 16.1 ఓవర్లలోనే 158 రన్స్‌కు ఆలౌట్ చేసింది. ఈ నేపథ్యంలో ఇంగ్లీష్ జట్టు 146 పరుగుల భారీ తేడాతో నెగ్గింది. టీ20 చరిత్రలోనే ఇంత భారీ తేడాతో నెగ్గిన జట్టుగా ఇంగ్లాండ్ వరల్డ్ రికార్డ్ కొట్టింది. జాంబియా బౌలర్లు చాలా నిస్సహాయంగా కనిపించారు. వీరంతా జింబాబ్వే బ్యాటర్స్ ముందు వికెట్ల కోసం వేడుకుంటూ కనిపించారు. జింబాబ్వే తరపున, కెప్టెన్ సికందర్ రజా కేవలం 43 బంతుల్లో 133 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. సికందర్ రజా 309.30 స్ట్రైక్ రేట్‌తో బ్యాటింగ్ చేశాడు. అతని ఇన్నింగ్స్‌లో 7 ఫోర్లు, 15 సిక్సర్లు బాదాడు. దీంతో పాటు, తదివానాషే మరుమాని 19 బంతుల్లో 62 పరుగులు చేశాడు. తదివానాషే మరుమాని 326.31 స్ట్రైక్ రేట్‌తో బ్యాటింగ్ చేసి తన ఇన్నింగ్స్‌లో 9 ఫోర్లు, 4 సిక్సర్లు బాదాడు. అదే సమయంలో, క్లైవ్ మదండే 17 బంతుల్లో 53 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. క్లైవ్ మదండే 311.76 స్ట్రైక్ రేట్‌తో బ్యాటింగ్ చేసి 3 ఫోర్లు, 5 సిక్సర్లు బాదాడు.టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో ప్రపంచ రికార్డు లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో జాంబియా జట్టు 14.4 ఓవర్లలో కేవలం 54 పరుగులకే కుప్పకూలింది.



# రెండోపెళ్లికి సిద్ధంగా ఉన్న నటి ఎస్తేర్

ఇప్పటి వరకు ఒకే పెళ్లితో జీవితం గడిపేయాల్సిన సమాజపు ఆలోచన మారిపోయింది. విడాకులు తీసుకున్న, జీవిత భాగస్వామి లేకపోయినా, కొత్త జీవితం కోసం మరోసారి పెళ్లి చేసుకోవడమే ఇప్పుడు సాధారణంగా మారింది. సామాన్యులే కాదు, సినీ ప్రపంచంలోనూ ఈ ట్రెండ్ స్పష్టంగా కనిపిస్తోంది. సింగర్ సునీత నుంచి అక్కినేని నాగచైతన్య వరకు చాలామంది రెండో పెళ్లి చేసుకున్న ఉదాహరణలు ఉన్నాయి. అలాంటిది తాజాగా ఈ జాబితాలో చేరబోతున్నారంటూ వార్తల్లో నిలుస్తున్నారు హీరోయిన్ ఎస్తేర్ నొరోన్హా. కర్ణాటకలోని ఉడిపి కి చెందిన ఎస్తేర్, ముంబైలో చదువుకున్నారు. బాలనటిగా కొంకణి సినిమాల్లో నటించి, ఆ తర్వాత 2012లో బారొమాస్ అనే హిందీ సినిమా ద్వారా హీరోయిన్‌గా అడుగుపెట్టారు. తెలుగులో పూరి జగన్నాథ్ సోదరుడు సాయిరామ్ శంకర్ హీరోగా నటించిన వేయి అబద్ధాలు సినిమాతో ఎంట్రీ- ఇచ్చి, భీమవరం బుల్లోడు, గరం, జయ జానకి నాయక, ఐరావతం, 69 సంస్కార్ కాలనీ, చెంగురే బంగారు రాజా, డెవిల్, -టెనెంట్, థలా వంటి సినిమాల్లో నటిస్తూ తనకంటూ గుర్తింపు సంపాదించుకుంది. సినిమాల విషయం పక్కన పెడితే.. వ్యక్తిగత జీవిత విషయంలో మాత్రం తరచూ వార్తల్లో నిలిచింది. కారణం సింగర్ నోయెల్.. అతని ప్రేమించి పెళ్లి చేసుకున్న ఆమె, ఏడాదిలోనే మనస్పర్థలతో విడాకులు తీసుకున్నారు. అయితే ఈ మధ్యకాలంలో ఎస్తేర్ రెండో పెళ్లి చేసుకోబోతున్నారంటూ గాసిప్స్ వినిపించాయి. తాజాగా వాటిని నిజం చేస్తూనే ఓ బిగ్ అనౌన్స్‌మెంట్ ఇచ్చేలా సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టింది. జీవితంలో మరో అందమైన సంవత్సరం.. అవకాశాలు, అద్భుతాలను ఇచ్చినందుకు దేవుడికి కృతజ్ఞతలు. పుట్టినరోజు సందర్భంగా మీ ప్రేమ, ఆశీర్వాదాలకు ధన్యవాదాలు. త్వరలోనే మీతో ఓ స్పెషల్ అనౌన్స్‌మెంట్ పంచుకుంటాను. వేచి ఉండండి' అని రాసుకొచ్చారు. ఈ పోస్ట్‌తో ఎస్తేర్ నిజంగానే రెండో పెళ్లి చేసుకోబోతుందా అనే వార్తలు హాట్ టాపిక్‌గా మారాయి.

# మిరాయ్ విజయంతో మనోజ్ ఆనందం

## తల్లి ఆశీర్వాదం తీసుకుని సెలబ్రేషన్స్



తేజ సజ్జా, మంచు మనోజ్  కీలక పాత్రల్లో రూపొందిన చిత్రం 'మిరాయ్' సినిమా విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ సక్సెస్‌ను కుటుంబం, స్నేహితులతో కలిసి మనోజ్  పండగ చేసుకున్నారు. తన తల్లి పాదాలకు నమస్కారం చేసి ఎమోషనల్ అయ్యారు. ఈ విజయం చూసి ఆమె భావోద్వేగానికి గురయ్యారని.. అందరికంటే గర్వంగా ఫీలయ్యారని మనోజ్ వీడియో షేర్ చేశారు. తనను ఆదరించిన అభిమానులకు ధన్యవాదాలు చెప్పారు. కార్తిక్ ఘట్టమనేని దర్శకత్వంలో తేజ సజ్జా, మంచు మనోజ్ కీలక పాత్రల్లో కనిపించిన ఈ చిత్రబృందం సక్సెస్ మీట్ నిర్వహించింది. అందులో మనోజ్ మాట్లాడుతూ ఎమోషనల్ అయ్యారు. తనను నమ్మిన దర్శక నిర్మాతలకు రుణపడి ఉంటానన్నారు. ఈరోజు ఎంతో ఆనందంగా ఉంది. 12 ఏళ్ల తర్వాత సక్సెస్‌తో నా ఫోన్ మోగుతూనే ఉంది. అభినందనలు వస్తున్నప్పటికీ నాకు ఇదంతా కలలా ఉంది. ఈ కథలో నన్ను భాగం చేసినందుకు కార్తిక్‌కు జన్మంతా రుణపడి ఉంటాను. ఇంతకుముందు నేను ఎక్కడికి వెళ్లినా 'అన్నా సినిమా ఎప్పుడు తీస్తావు. కమ్‌బ్యాక్ ఎప్పుడు?' అని అందరూ అడిగేవారు. త్వరలోనే వస్తాను అని చెప్పేవాడిని. వాళ్లతో బయటకు ధైర్యంగా మాట్లాడినా.. లోపల తెలియని భయం ఉండేది. చాలా సినిమాలు చివరి నిమిషంలో క్యాన్సిల్ అయ్యాయి. అలాంటి టైమ్‌లో కార్తిక్ నన్ను  నమ్మడం నా అదృష్టం. మీరు నన్ను మాత్రమే నిలబెట్టలేదు.. నాతో పాటు నా కుటుంబాన్ని కూడా నిలబెట్టారని దర్శకుడు కార్తిక్‌కు మంచు మనోజ్ థాంక్స్ చెప్పారు.  నిర్మాత కూడా ఎంతో ధైర్యంగా దీన్ని పూర్తిచేశారు. 'మనోజ్‌తో సినిమా వద్దు' అని ఆయనకు ఎంతోమంది చెప్పి ఉంటారు. అవేవీ వినకుండా విశ్వప్రసాద్ దీన్ని నిర్మించారు. 'మిరాయ్' వీఎఫ్‌ఎక్స్ టీమ్ తెలుగు సినిమా గర్వపడేలా చేసింది. ముఖ్యంగా ఒక విషయం చెప్పాలి. ప్రతి ఇంట్లో నుంచి మనోజ్ గెలవాలి అని కోరుకున్న వారందరికీ పేరుపేరునా పాదాభివందనం. నామీద నమ్మకం పెట్టుకున్నందుకు అందరికీ ధన్యవాదాలు. ఇకపై వరుస సినిమాలు చేస్తూ మీ అందరినీ అలరిస్తాను అని మనోజ్ తెలిపారు. ఇక మిరాయ్‌లో మహావీర్ లామా పాత్రలో మనోజ్ అందరినీ ఆకట్టుకుంటున్నారు.

# రెండో బేబీ కోసం ప్లాన్ చేస్తున్నాం

## రామ్‌చరణ్- ఉపాసన దంపతులు వెల్లడి



టాలీవుడ్‌లో రామ్‌చరణ్-ఉపాసన దంపతులు ఎప్పుడూ అందరి దృష్టిని ఆకర్షిస్తూనే ఉంటారు. మొదట్లో ఉపాసన పై విమర్శలు వచ్చినప్పటికీ, ఇప్పుడు ఆమెపై ప్రశంసల వర్షం కురుస్తోంది. ఈ ఏడాది వీరిద్దరూ మెగా అభిమానులకు శుభవార్త అందించారు. పెళ్ళైన 11 ఏళ్ల తర్వాత ఉపాసన తల్లిగా మారారు. వీరికి పాప పుట్టగా, ఆ చిన్నారికి క్లీంకారా అని పేరు పెట్టారు. పాప పుట్టిన తర్వాత మెగా కుటుంబంలో ఆనందం అంబరాన్ని తాకింది. అయితే ఇప్పటి వరకు ఆ చిన్నారిని ప్రపంచానికి చూపించలేదు. అందుకే అభిమానులు కూడా ఆమెను చూడడానికి ఆతృతగా ఎదురు చూస్తున్నారు. అయితే తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఉపాసన మాట్లాడుతూ.. రెండో సంతానం పై స్పందించారు.. మొదటి బిడ్డ విషయంలో ఆలస్యం చేశాం. నేను పదేళ్ల తర్వాత తల్లిని అయ్యాను. ఆ సమయంలో విమర్శలు, ఒత్తిడి ఎదురైనా పట్టించుకోలేదు. కానీ రెండో బిడ్డ విషయంలో అలాంటి తప్పు చేయదలచుకోవడం లేదు. సెకండ్ చైల్డ్ కోసం నేను సిద్ధంగా ఉన్నాను అని చెప్పింది. అంతే కాదు రామ్‌చరణ్-ఉపాసన దంపతులు కుటుంబ విషయాలతో పాటు- వ్యాపార రంగంలో కూడా ముందుకు సాగుతున్నారు. నిర్మాతగా ఇప్పటికే విజయాలు అందుకున్న రామ్‌చరణ్, ఇప్పుడు థియేటర్ బిజినెస్లోకి అడుగు పెట్టాలని నిర్ణయించుకున్నారు. హైదరాబాద్‌లో లగ్జరీ మల్టీప్లెక్స్‌ను నిర్మించే ప్రాజెక్ట్‌కు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ మల్టీప్లెక్స్ నిర్వహణ బాధ్యతలను ఉపాసన తీసుకోబోతున్నట్లు- తెలుస్తోంది. అపోలో గ్రూప్స్‌తో కలిసి పలు విజయవంతమైన వ్యాపారాలు నడిపిన అనుభవం ఉన్నందున, ఈ ప్రాజెక్టు కూడా ఆమె చేతుల్లో విజయవంతమవుతుందని భావిస్తున్నారు. మెగాస్టార్ చిరంజీవి కూడా ఈ నిర్ణయానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు- సమాచారం. మొత్తానికి మెగా అభిమానులకు ఇది నిజంగా గుడ్ న్యూస్.

# అనుష్క శెట్టి బాటలో మరో నటి ఐశ్వర్య లక్ష్మి

వరుస విజయాలతో దూసుకుపోతున్న యువ నటి ఐశ్వర్య లక్ష్మి, తన అభిమానులకు షాక్ ఇస్తూ అనూహ్య నిర్ణయం తీసుకున్నారు. సోషల్ మీడియా ప్రపంచానికి శాశ్వతంగా వీడ్కోలు పలుకుతున్నట్లు ఆమె ప్రకటించారు. తన మానసిక ప్రశాంతతకు, వృత్తికి ఇది ఆటంకంగా మారిందని వివరిస్తూ ఓ భావోద్వేగ లేఖను పంచుకున్నారు. ప్రస్తుతం ఈ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సినిమా రంగంలో నిలదొక్కుకోవాలంటే సోషల్ మీడియా తప్పనిసరి అని తొలుత భావించానని ఐశ్వర్య తెలిపారు. కానీ, అది తన పనికి ఆటంకం కలిగించడమే కాకుండా, తన ఆలోచనలను దోచుకుందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. "చిన్న చిన్న సంతోషాలను కూడా ఇది దుఃఖంగా మార్చేసింది. అంతర్జాలం సృష్టించే ఊహలకు, అంచనాలకు అనుగుణంగా జీవించడం ఒక మహిళగా నాకు చాలా కష్టంగా మారింది" అని ఆమె తన నోట్‌లో పేర్కొన్నారు.

ఒక కళాకారిణిగా తనలోని అమాయకత్వాన్ని, వాస్తవికతను కాపాడుకోవడానికే ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు ఆమె స్పష్టం చేశారు. "సోషల్ మీడియా లేని వారిని ఈ రోజుల్లో జనాలు మర్చిపోతారని తెలుసు. అయినా ఆ సాహసానికి నేను సిద్ధంగా ఉన్నాను. నాలోని నటిని బతికించుకోవడానికే ఇంటర్నెట్‌కు దూరంగా ఉంటున్నాను" అని ఆమె వివరించారు. ఈ నిర్ణయం తన జీవితంలో బలమైన బంధాలను ఏర్పరుస్తుందని, మరిన్ని మంచి చిత్రాలలో నటించడానికి దోహదపడుతుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. తనను ప్రేమగా గుర్తుంచుకోవాలని అభిమానులను కోరారు.'మామన్' చిత్రంతో భారీ విజయాన్ని అందుకున్న ఐశ్వర్య లక్ష్మి, ప్రస్తుతం 'గట్ట కుస్తీ-2', 'సంబరాల ఏటిగట్టు' వంటి చిత్రాలతో బిజీగా ఉన్నారు. ఇలాంటి సమయంలో ఆమె సోషల్ మీడియాను వీడటం చర్చనీయాంశంగా మారింది. ఇటీవలే నటి అనుష్క శెట్టి కూడా సోషల్ మీడియాకు దూరమవుతున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో, ఇప్పుడు ఐశ్వర్య కూడా అదే బాట పట్టడం గమనార్హం. దీనితో కథానాయికలు వరుసగా ఇలాంటి నిర్ణయాలు ఎందుకు తీసుకుంటున్నారనే దానిపై నెటిజన్ల మధ్య ఆసక్తికర చర్చ జరుగుతోంది.



# పిల్లల ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలకు ఆధార్ లింక్ చేయాలి: సాయి తేజ్

**సోషల్ మీడియాలో చిన్నారుల ఫోటోలు, వీడియోల దుర్వినియోగాన్ని అరికట్టాలని పిలుపు**

సోషల్ మీడియాలో చిన్నారుల భద్రతపై మెగా హీరో సాయి దుర్గ తేజ్ కీలక వ్యాఖ్యలు చేశారు. పిల్లల ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి ఖాతాలకు ఆధార్‌ను తప్పనిసరిగా అనుసంధానం చేయాలని ఆయన సూచించారు. దీనివల్ల ఆన్‌లైన్‌లో వారి ఫోటోలు, వీడియోల దుర్వినియోగానికి అడ్డుకట్ట వేయవచ్చని అభిప్రాయపడ్డారు. హైదరాబాద్‌లో జరిగిన 'అభయం మసూమ్-25' సదస్సులో పాల్గొన్న సందర్భంగా సాయి తేజ్ ఈ వ్యాఖ్యలు చేశారు. సోషల్ మీడియాలో పిల్లల ఫోటోలు, వీడియోలు పోస్ట్ చేయడం పట్ల తల్లిదండ్రులకు తాను గతంలోనే హెచ్చరిక చేశానని గుర్తుచేశారు. "నిజ జీవితం వేరుగా ఉంటుంది. మీరు సరదాగా పెట్టే పిల్లల ఫోటోలు దుర్వినియోగం అయ్యే ప్రమాదం ఉంది" అని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. చిన్నారులపై అశ్లీలతతో కూడిన అనైతిక వ్యాఖ్యలు చేసే వారిపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఇలాంటి కామెంట్లు చేసేవారికి భవిష్యత్తులో పిల్లలు పుట్టరా? వారి సొంత పిల్లలు, బంధువులు లేదా స్నేహితుల పిల్లలపై ఇలాంటి వ్యాఖ్యలు వస్తే ఊరుకుంటారా? వీరికి కనీస నైతిక విలువలు లేవా?" అంటూ తీవ్రస్థాయిలో ప్రశ్నించారు. వందల మంది ఇలాంటి వ్యాఖ్యలను లైక్ చేయడం, కామెంట్ చేయడం చూసి తాను




చాలా నిరాశకు గురైనట్లు తెలిపారు. ఈ విషయంపై సమాజం నుంచి గానీ, మీడియా నుంచి గానీ 24 గంటలు ఎదురుచూసినా ఎలాంటి స్పందన రాకపోవడంతో, తానే బాధ్యత తీసుకున్నానని సాయి తేజ్ వెల్లడించారు. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులను, ఉన్నత పోలీసు అధికారులను ట్యాగ్ చేస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ చేసినట్లు వివరించారు. ఇలాంటి అనైతిక ప్రవర్తనను 'డార్క్ కామెడీ' అని చెప్పి సమర్థించుకోవడం సరికాదని, ఇది ఇతరుల మనోభావాలను దెబ్బతీస్తుందని ఆయన స్పష్టం చేశారు. సోషల్ మీడియా వేదికలపై చిన్నారుల భద్రత కోసం కఠినమైన చర్యలు తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు